
ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 29.0
కనిష్ఠం 19.4

ANDHRAJYOTHY



యాదాద్రి భువనగిరి

5

సోమవారం 25 నవంబరు 2024



యాదగిరిగుట్టపై
భక్తుల సందడి

- స్వామివారిని దర్శించుకున్న 66వేల మంది భక్తులు

6



రుణాలు లక్ష్యానికి మించి

గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి వానాకాలంలో బ్యాంకర్లు లక్ష్యానికి మించి రుణాలు మంజూరు చేశారు. కొత్త రుణాలతో పాటు రెన్యువల్స్ కూడా చేయడంతో లక్ష్యం మించింది. రాష్ట్ర ప్రభుత్వం రూ.2లక్షల వరకు రుణమాఫీ చేయడంతో కొత్త రుణాలు ఇచ్చేందుకు మార్గం సుగమమైంది. దీంతో బ్యాంకర్ల రుణ లక్ష్యం దాటింది.

- (ఆంధ్రజ్యోతి,నల్లగొండ)

- కొత్త రుణాలతో పాటు రెన్యువల్స్ కూడా అధికమే
- నల్లగొండ జిల్లాలో వానాకాలంలో రూ.7,399కోట్లు మంజూరు
- యాసంగిలో రూ.2,204.31కోట్లు
- సూర్యాపేట, యాదాద్రి జిల్లాల్లో 80శాతం మేర పూర్తి

వానాకాలంలో పంట రుణాలు అధికంగా ఇవ్వడంతో సీజన్‌లో రైతులకు ప్రయోజనం చేకూరింది. బ్యాంకర్లు అత్యధికంగా పంట రుణాలకు ప్రాధాన్యం ఇచ్చారు. రాష్ట్ర స్థాయిలో జరిగిన బ్యాంకర్ల సమావేశంలో నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా రుణాలు మంజూరు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా ఇచ్చినపుంటే రైతులు పంట రుణాలు తక్కువగా తీసుకునే అవకాశాలు ఉండేవి. అయితే పార్లమెంటు ఎన్నికల ముందు గత ప్రభుత్వం రైతు బంధు పథకాన్ని ఎలా మంజూరు చేసిందో అదే మాదిరిగా కాంగ్రెస్ ప్రభుత్వం కూడా రైతుబంధు నిధులను ఎన్నికల ముందు రైతుల ఖాతాల్లో జమ చేసింది. ఆ తరువాత రైతు భరోసాపై రైతులతో, అధికారులతో విస్తృతంగా చర్చించి ఈ పథకాన్ని అమలు చేయాలని ప్రభుత్వం సమాలోచనలు చేసినా, అది నేటికీ అమలుకు నోచుకోలేదు. గత ప్రభుత్వం ఒక్కో సీజన్‌లో ఎకరాకు రూ.5వేల వరకు రైతుబంధు ఇవ్వగా, కాంగ్రెస్ ప్రభుత్వం రూ.7500 చొప్పున ఏడాదికి రెండు పంటలకు, మొత్తం ఎకరానికి రూ.15వేల వరకు ఇవ్వనున్నట్టు ప్రకటించింది. అయితే ఇది నేటికీ ఆచరణకు నోచుకోలేదు. బ్యాంకు రుణాలు మాత్రం పెద్ద మొత్తంలో అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం సఫలీకృతమైంది.

నల్లగొండ జిల్లాలో రూ.7,399కోట్లు

నల్లగొండ జిల్లాలో వానాకాలం సీజన్‌లో బ్యాంకర్లు ఇచ్చిన లక్ష్యాన్ని అధిగమించారు. జిల్లా వ్యాప్తంగా రూ.3,301కోట్ల బ్యాంకు రుణాలు ఇవ్వాల్సి ఉండగా, అంతకు మించి రూ.7,399కోట్లు పంపిణీ చేశారు. రూ.4,098కోట్లు అధికంగా బ్యాంకర్లు రుణాలు మంజూరు చేశారు. ఎప్పటికప్పుడూ జిల్లాలో మండల, నియోజకవర్గ స్థాయిలో సమీక్ష సమావేశాలను ఏర్పాటు చేస్తూ లీడ్ బ్యాంకు అధికారులు లక్ష్యాన్ని అధిగమించేలా కృషి చేశారు. రుణమాఫీ జరగడంతో తిరిగి కొత్త రుణాలు ఇచ్చేందుకు కలిసి వచ్చింది. సుమారు రూ.1,600కోట్ల మేర రైతులకు రుణమాఫీ జరిగింది. దీంతో 2లక్షల మంది రైతులకు లబ్ధి చేకూరింది. రూ.2లక్షలకు పైగా రుణం ఉంటే ప్రభుత్వం మాఫీ చేయకపోవడంతో రైతులు ఎదురుచూస్తున్నారు. రూ.2లక్షలకు పైగా ఉన్న రుణాలు ఎప్పుడు మాఫీ అవుతాయో ప్రభుత్వం స్పష్టతలేదు. ఇప్పటికే వ్యవసాయ అధికారులు, బ్యాంకర్ల నుంచి ప్రభుత్వం నివేదిక తీసుకుంది. ఈ రుణాలకు సంబంధించి రుణమాఫీ విధివిధానాలు ఖరారు చేయాల్సి ఉంది. వానాకాలం సీజన్‌కు ముందునుంచే రుణాల పంపిణీ జరిగింది. పంటలకు రుణపరిమితి అధికంగా ఉండటంతో లక్ష్యాన్ని చేరడం సులువైంది. సూర్యాపేట జిల్లాలో రూ.2,614కోట్లు, యాదాద్రి జిల్లాలో రూ.2,268కోట్లు రుణాల లక్ష్యం కాగా, ఇప్పటి వరకు 80శాతం మేర పంపిణీ పూర్తయింది. ఈ రెండు జిల్లాలో కూడా గతంకంటే అధికంగానే రుణాలను బ్యాంకర్లు మంజూరు చేశారు.

యాసంగి రుణాల పంపిణీకి ప్రణాళిక

అధికార యంత్రాంగం యాసంగి సీజన్‌లో రుణాల పంపిణీకి ప్రణాళికలు సిద్ధం చేసింది. నల్లగొండ జిల్లాలో ఇప్పటికే నాన్ ఆయకట్టు ప్రాంతంలో సీజన్ మొదలైంది. ఈ సారి యాసంగి సీజన్‌లో రూ.2,204.31కోట్ల రుణాన్ని ఇచ్చేందుకు అధికారులు నిర్ణయించారు. ప్రస్తుతం రుణపరిమితి కింద వరికి ఎకరాకు రూ.50వేల వరకు రుణమిస్తున్నారు. ఈ యాసంగిలో కేవలం వరిపంట అధికంగా సాగుకానుంది. మెట్టపంటలు అధికంగా ఉండవు. ఈ నేపథ్యంలో వరి సేద్యం కోసం రుణాలు విరివిగా ఇచ్చేందుకు నిర్ణయించారు. అయితే వానాకాలంలో వరితో పాటు పత్తి, మెట్ట పంటలు

- మిగతా 6వ పేజీలో

భూదాన్‌పోచంపల్లిలో రహదారిని కప్పేసిన మంచు



చలి పంజా

- ఉమ్మడి జిల్లాలో ఐదు రోజులుగా తగ్గిన కనిష్ఠ ఉష్ణోగ్రతలు
- 19.4డిగ్రీలకు పడిపోయిన ఉష్ణోగ్రతలు

నల్లగొండ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా ఐదు రోజులుగా చలి తీవ్రత పెరిగింది. కనిష్ఠ ఉష్ణోగ్రతలు తగ్గిపోతుండటంతో ప్రజలు గజగజా వణుకుతున్నారు. రోజురోజుకూ చలి తీవ్రత పెరుగుతుండటంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈనెల 19న 22 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు ఉండగా, 20వ తేదీ నుంచి 19డిగ్రీలకు దిగువన కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. చలి తీవ్రతతో ప్రధానంగా చిన్నారులు, వృద్ధులు అధికంగా ఇబ్బందులు పడుతున్నారు. చల్లటి వాతావరణంతో ప్రజలకు అనారోగ్య సమస్యలు అధికమవుతున్నాయి.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈనెల 20వ తేదీ నుంచి అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదవడంతోపాటే తెల్లవారుజామున విపరీతమైన మంచు తీవ్రత పెరిగింది. ఈ ఏడాది నవంబరు మూడో వారం నుంచి చలి ప్రతాపం చూపిస్తోంది. డిసెంబరు మాసంలో చలి ప్రభావం మరింత ఎక్కువ ఉండే అవకాశాలు ఉన్నాయని వాతావరణశాఖ పేర్కొంటోంది. చిన్నారులు, వృద్ధులు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. చలి తీవ్రత కారణంగా నిమోనియా బారినపడే అవకాశాలు ఉన్నాయి. చలికాలంలో జలుబు, దగ్గు, జ్వరం, శ్వాస సంబంధ సమస్యలతో ప్రజలు ఆస్పత్రుల పాలవుతున్నారు. అంతేగాక అలర్జీ, శరీరంపై దద్దుర్లతో పాటు, గొంతు నొప్పి వంటివి సమస్యలు అధికంగా వస్తున్నాయి. ఊపిరితిత్తుల్లో ఇన్‌ఫెక్షన్ పెరిగి తుమ్ములతో పాటు పిల్లికూతలు వస్తాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ప్రధానంగా చిన్న పిల్లలు, వృద్ధులు జాగ్రత్తలు తీసుకోవాలంటున్నారు. చిన్న పిల్లలు చలికాలంలో వెచ్చగా ఉండేందుకు స్వెట్టర్లు, చెవులకు మంకీ క్యాపు ధరించాలని, వీలైతే కాళ్లు, చేతులకు సాక్సులు, గ్లౌజ్‌లు వినియోగించాలని చెబుతున్నారు. ఉదయం పూట చిన్న పిల్లలను కొద్దిసేపు ఎండలో ఉంచితే ప్రయోజనమని, వీలైనంత మేరకు ఉదయం, రాత్రి ప్రయాణం చేయకుండా చూడాలని పేర్కొంటున్నారు. చలికాలంలో వైరస్, బ్యాక్టీరియా, ఫంగస్ పెరుగుతుందని, శ్వాస తీసుకునేటప్పుడు గాలితో పాటు సూక్ష్మజీవులు శరీరంలోకి ప్రవేశించి తెల్ల రక్తకణాలను నిర్వీర్యం చేయడంతో రోగనిరోధక శక్తి తగ్గుతుందని, అంతా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

ఐదు రోజులుగా ఉష్ణోగ్రతలు ఇలా..

తేదీ	గరిష్ఠం	కనిష్ఠం
20న	29.0	19.0
21న	29.5	18.8
22న	29.0	18.4
23న	28.5	19.0
24న	29.0	19.4

న్యూస్ బాక్స్

ఆరు గ్యారెంటీలను అమలు చేయాలి

ఐద్వా జిల్లా కార్యదర్శి బట్టుపల్లి అనురాధ



సమావేశంలో మాట్లాడుతున్న ఐద్వా జిల్లా కార్యదర్శి బట్టుపల్లి అనురాధ

రామన్నపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రకటించిన ఆరు గ్యారెంటీలను అమలు చేసి, మహిళల సమస్యలను పరిష్కరించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి బట్టుపల్లి అనురాధ ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. ఆదివారం మునిపంపుల గ్రామంలో జరిగిన మహిళా సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల పేరుతో నెలకు రూ.2500 ఇస్తామని, రేషన్‌కార్డులు ఇస్తామని, కల్యాణలక్ష్మీ, తులం బంగారం పెడతామని ప్రజల్ని మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలను విస్మరించిందన్నారు. అనంతరం ఐద్వా నూతన గ్రామ శాఖ ఎన్నుకోవడం జరిగింది. గ్రామ అధ్యక్షురాలిగా యాదాసు శారద, కార్యదర్శిగా తాళ్లపల్లి హేమలత, ఉపాధ్యక్షులుగా బొడ్డుపల్లి సంధ్య, బూడిద లక్ష్మి, ఉండ్రాతి పూలమ్మ తదితరులను ఎన్నుకున్నారు.

జాగ్రత్తలతోనే ఆరోగ్య సమస్యలకు దూరం

డీఎంహెచ్‌వో డాక్టర్ మనోహర్

ఆరోగ్య శాఖ అధికారుల హాస్టల్‌బాట



హాస్టల్‌లో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

భువనగిరి టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): జాగ్రత్తలతోనే శీతాకాల ఆరోగ్య సమస్యలను అధిగమించవచ్చునని డీఎంహెచ్‌వో ఎం.మనోహర్ అన్నారు. కలెక్టర్ హనుమంతరావు ఆదేశాలమేరకు చేపట్టిన ఆరోగ్య శాఖ అధికారుల హాస్టల్ బాటలో భాగంగా శని, ఆదివారాల్లో జిల్లాలోని 89 ప్రభుత్వ హాస్టళ్లలో విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం భువనగిరిలోని హాస్టళ్లలో డీఎంహెచ్‌వో మాట్లాడుతూ హాస్టళ్లలో పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలన్నారు. వంట పాత్రలను, వంట శాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, లేదంటే విద్యార్థులకు అనారోగ్య సమస్యలు ఎదురయ్యే ప్రమాదం ఉందన్నారు. చలి తీవ్రత పెరుగుతున్నందున విద్యార్థులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆరోగ్య సమస్యలు ఎదురైనా వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్లి చికిత్సలు పొందాలని సూచించారు.

గోదావరి జలాలతోనే సాగు

ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య



మైలారిగూడెంలో చెరువు వద్ద పూజలు నిర్వహిస్తున్న విప్ అయిలయ్య

యాదగిరిగుట్ట రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆలేరు నియోజకవర్గంలో ఇప్పటి వరకు 90శాతం చెరువులను గోదావరి జలాలతో నింపామని, వాటితోనే రైతులు పంటలు సాగుచేసుకుంటారని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. ఆదివారం మండలంలోని మైలారిగూడెం గ్రామంలోని చెరువువద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం వైఫల్యంతోనే ఆలేరు ప్రాంతం ఎడారిగా మారిందని, పక్కనే ఉన్న ప్రాజెక్టుల ద్వారా ఆలేరుకు నీళ్లు ఇవ్వకుండా అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తంచేశారు. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం మేరకు గొలుసుగట్టు చెరువులన్నీ నింపి రైతులకు అండగా ఉంటానని చెప్పారు. గ్రామాల్లో ఎలాంటి సమస్య ఉన్నా తన దగ్గరకు వస్తే సాధ్యమైనంత వరకు పరిష్కరించడాకి కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చీర శ్రీశైలం, పార్టీ మండల అధ్యక్షుడు కానుగ బాలరాజ్‌గౌడ్, కాదూరి అచ్చయ్య, మదర్ డెయిరీ డైరెక్టర్ పుప్పాల నర్సింహ, ప్రజాప్రతినిధులు , నాయకులు పాల్గొన్నారు.

బహిరంగ మార్కెట్ విలువ చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న చౌటుప్పల్ పీఏసీఎస్ చైర్మన్ దామోదర్‌రెడ్డి

చౌటుప్పల్ టౌన్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): త్రిపుల్‌ఆర్ బాధితులకు బహిరంగ మార్కెట్ విలువ ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని చౌటుప్పల్ పీఏసీఎస్ చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. చౌటుప్పల్ పట్టణంలో త్రిపుల్ ఆర్ బాధితుల సమావేశం జరిగింది. ఈసందర్భంగా దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్ చుట్టూ ఉన్న ఔటర్‌రింగ్ రోడ్డుకు 40 కిలోమీటర్ల దూరంలో ఏర్పాటు చేయాల్సిన త్రిపుల్‌ఆర్‌ను కేవలం 28కిలోమీటర్ల పరిధిలో నిర్మించేందుకు అలైన్‌మెంట్ ఖరారు చేయడం సరైన పద్ధతి కాదన్నారు. త్రిపుల్‌ఆర్ అలైన్‌మెంట్ మార్చాలని, లేదంటే భూమికి భూమి ఇవ్వాలని లేదా బహిరంగ మార్కెట్ విలువను పరిగణలోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహిస్తామని హెచ్చరించారు. సమావేశంలో చౌటుప్పల్, వలిగొండ, భువనగిరి, గజ్వేల్ మండలాలకు చెందిన భూనిర్వాసితులతో పాటు మాజీ జడ్పీటీసీ పెద్దిటి బుచ్చిరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గిర్కటి నిరంజన్‌గౌడ్, మండల ఉపాధ్యక్షుడు చిన్నం బాలరాజ్, మండల ప్రధాన కార్యదర్శి ఢిల్లీ మాధవరెడ్డి, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కృష్ణారెడ్డి,నర్సింహ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



గ్రామోత్సవాన్ని ప్రారంభిస్తున్న జిల్లా యువజన, క్రీడల అధికారి ధనాంజనేయులు

గ్రామ ప్రజల్లోనే చైతన్యం, ప్రతిభ

జిల్లా క్రీడల అధికారి ధనాంజనేయులు

భువనగిరి టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రజల్లోనే అన్నిరంగాల్లో చైతన్యం, ప్రతిభ ఉంటుందని జిల్లా యువజన, క్రీడల అధికారి కె.ధనాంజనేయులు అన్నారు. 16వ ఈశా గ్రామోత్సవంలో భాగంగా ఆదివారం భువనగిరిలో నిర్వహించిన రూరల్ ప్రీమియర్ లీగ్-2024 సౌత్ ఇండియా లెవల్ జిల్లాస్థాయి పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. దేశంలో గ్రామీణ ప్రాంతమే అధికంగా ఉందని, దేశాన్ని కలిపి ఉంచే లక్ష్యంతో ఈశా ఫౌండేషన్ ప్రతి సంవత్సరం దేశమంతటా గ్రామోత్సవాల పేరిట కార్యక్రమాలు నిర్వహిస్తుండడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ కార్యదర్శి బాలకృష్ణ, ఈశా ఫౌండేషన్ ప్రతినిధులు పవన్, దివ్య తదితరులు పాల్గొన్నారు.



వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

మోత్కూరు మార్కెట్
చైర్‌పర్సన్‌గా విమల

మార్కెట్ కమిటీని ప్రకటించిన ప్రభుత్వం



చైర్‌పర్సన్ విమల



వైస్‌చైర్మన్ నర్సిరెడ్డి

మోత్కూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మోత్కూరు వ్యవసాయ మార్కెట్‌కు సుదీర్ఘ విరామం తర్వాత ఆదివారం వ్యవసాయ శాఖ ప్రభుత్వ కార్యదర్శి ఎం.రఘునందన్‌రావు నూతన పాలకవర్గాన్ని ప్రకటించారు. గత పాలక వర్గ పదవీకాలం 2023 ఆగస్టులో ముగిసింది. గత డిసెంబరులో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కాగా ఇప్పటి వరకు పాలక వర్గాన్ని ప్రకటించలేదు. మోత్కూరు మార్కెట్ పరిధిలో తుంగతుర్తి, ఆలేరు నియోజకవర్గాలకు చెందిన మోత్కూరు, అడ్డగూడూరు, గుండాల, ఆత్మకూరు(ఎం) మండలాలున్నాయి. మార్కెట్ చైర్‌పర్సన్ పదవి బీసీ మహిళకు రిజర్వు అయ్యింది. బీఆర్ఎస్ ప్రభుత్వంలో మోత్కూరుకు చెందిన నాయకునికి చైర్మన్‌గా అవకాశం ఇవ్వగా, ఈ సారి గుండాల మండలానికి ఇచ్చారు. మోత్కూరు మార్కెట్ చైర్‌పర్సన్‌గా నూనెముంతల విమలవెంకటేశ్వర్లు (అనంతారం), వైస్‌చైర్మన్ లింగాల నర్సిరెడ్డి (డి.రేపాక), డైరెక్టర్లుగా గూడెపు కుమార్ (మరిపడిగ), పాశం వినోద(ఆత్మకూరు), పోచం జగన్నాథం(మోత్కూరు), బొడిగె నర్సింహ(లింగరాజుపల్లి), ఎండి.సమీరొద్దీన్(మోత్కూరు), వనం బాలకృష్ణ (రాజన్నగూడెం), బాలెంల విద్యాసాగర్(అడ్డగూడూరు), కొంపెల్లి లలిత(పాలడుగు), పన్నాల శ్రీనివాస్‌రెడ్డి(మోత్కూరు), చిత్తలూరి సోమయ్య(కోటమర్తి), వ్యాపారుల నుంచి సోమ వెంకటేశ్వరు (మోత్కూరు), బుస్స రవి(మోత్కూరు)ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. రైతు సేవా సహకార సంఘం చైర్మన్ పేలపూడి వెంకటేశ్వర్లు, మునిసిపల్ చైర్‌పర్సన్ గుర్రం కవితలక్ష్మీనర్సింహారెడ్డి, మార్కెటింగ్ జిల్లా అధికారి, ఏడీఏ కూడా పాలకవర్గ సభ్యులుగా ఉంటారు.

ప్రజల తప్పిదంతోనే..

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి

భువనగిరి టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రజల తప్పిదంతోనే తెలంగాణ ద్రోహులు రాష్ట్ర పాలకులుగా ఉన్నారని, కన్నతల్లిలాంటి బీఆర్ఎస్‌ను కాదని కాంగ్రెస్‌కు పట్టంకట్టి నేడు క్షోభిస్తున్నారని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం భువనగిరిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ 14 ఏళ్ల పోరాటం, అమరుల ప్రాణత్యాగాల ఫలితంగా సిద్ధించిన తెలంగాణలో మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ రాష్ట్రాన్ని, ప్రజలను దివాలా తీయిస్తోందని విమర్శించారు. ఈ మేరకు నవంబరు 29ని దీక్షా దివస్‌గా పేర్కొంటూ భువనగిరిలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో దీక్షలు చేయనున్నట్లు తెలిపారు. దీక్షా దివస్ జిల్లాస్థాయి సన్నాహక సమావేశం 26న భువనగిరిలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు, దీక్షా దివస్ జిల్లా ఇన్‌చార్జీ, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి ముఖ్య అతిథులుగా రానున్నట్లు తెలిపారు. జిల్లా బీఆర్ఎస్ ముఖ్య నాయకులందరూ ఆ రెండు కార్యక్రమాల్లో పాల్గొనాలన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ పట్టణ, మండల అధ్యక్ష, కార్యదర్శులు ఏవి కిరణ్‌కుమార్, జనగాం పాండు, రచ్చ శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపీపీ అతికం లక్ష్మీనారాయణ గౌడ్, మాజీ జడ్పీటీసీ సుబ్బూరు బీరుమల్లయ్య, సురిపంగ సుభాష్, కృష్ణ, ఎండి అంజద్ తదితరులు పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలి

సైనిక మహిళా గురుకుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నిరూప

బీబీనగర్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని సైనిక మహిళా గురుకుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నిరూప అన్నారు. బీబీనగర్ శివారులోని సాంఘిక సంక్షేమ సైనిక మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో ఆదివారం ఎన్‌సీసీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ నిరూప జెండా ఎగురవేసి ఉత్సవాలను ప్రారంభించగా ఎన్‌సీసీ కేడెట్లు వరుస కవాతులు, డ్రిల్స్ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ నిరూప విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ భవిష్యత్‌లో దేశం గర్వించే ప్రతిభా వంతులుగా ఎదగాలని సూచించారు. అన్ని రంగాల్లో ఉన్నత శిఖరాలకు చేరి దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ కె శ్రీలత, అధ్యాపకులు ప్రతిభ, రజితతో పాటు ఆర్మీ ఏడీఐలు పాల్గొన్నారు.

ఆఖరి విడిది...ఆరుబయట

- అద్దె ఇంటి వాసుల 'చావు' ఇక్కట్లు
- నడిబజార్లో పడుతున్న విగతజీవులు
- అగౌరవంగా అంతిమ వీడ్కోలు

సొంతిల్లు లేక కొందరు, బతుకుదెరువు కోసం వలస వచ్చి అద్దె ఇంట్లో నివసిస్తున్న ఇంకొందరు 'చావు' ఇక్కట్లను అనుభవిస్తున్నారు. ఏ కారణంతోనైనా చనిపోతే వారి మృతదేహం నడి వీధిన పడుతోంది. ఆస్తులు, అంతస్తులు లేకపోయినా, ఆత్మాభిమానంతో బతికిన వ్యక్తుల జీవిత చరమాంకపు 'ఆఖరి విడిది' నీడలేని 'ఆరు బయటే' తీరిపోతోంది. అద్దె ఇళ్లలో నివసిస్తున్న సదరు మృతుల అంతిమ సంస్కారాలు, ఆపై కర్మక్రియలు అగమాగంగా జరుగుతున్న పరిస్థితులు మనసులను కదిలించేలా చేస్తున్నాయి. ఇలాంటి సంఘటనలు ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఇటీవల చోటుచేసుకున్నాయి.

(ఆంధ్రజ్యోతి-నార్కట్‌పల్లి / మోత్కూరు / భువనగిరి టౌన్)



మోత్కూరు పశువుల సంతలో ఉంచిన రాధమ్మ భౌతిక కాయం(ఫైల్)

నార్కట్‌పల్లిలో మూడేళ్ల కిందట అద్దె ఇంట్లో ఉండే ఓ వృద్ధుడు చనిపోతే సదాచారాలను పాటించే ఇంటి యజమాని అభ్యంతరం చెప్పారు. ఆ పరిస్థితుల్లో మృతదేహాన్ని ఎక్కడ ఉంచాలో తెలియక కుటుంబ సభ్యులు ఆవేదన పడ్డారు. ఆ సమయంలో మానవత్వంతో వ్యవహరించిన ఓ కుటుంబం 'పెద్ద' మనసుతో ఆ రోజు ఓ వృద్ధుడి భౌతికదేహం కొంత గౌరవప్రదంగా అంతిమస్థానానికి చేరింది. ఇదే నార్కట్‌పల్లిలోనే ఇటీవల మరో వృద్ధురాలు మృతి చెందగా ఆమె మృతదేహం నడివీధిన వేసిన వైనం మరలా వారి సమస్యను ఎత్తిచూపించింది.

యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రం భువనగిరి పట్టణంలో కొంతకాలం కిందట సాంప్రదాయ కుటుంబానికి చెందిన ఓ వృద్ధుడు అనారోగ్యంతో హైదరాబాద్‌లో ఆసుపత్రిలో చికిత్సపొందుతున్న క్రమంలో ఆరోగ్యం క్షీణించడంతో ఆసుపత్రివర్గాలు అతడిని డిశ్చార్జీ చేశాయి. ఈ సమాచారం అందుకున్న ఇంటి యజమాని ఆ వృద్ధుడిని ఇంటికి తీసుకురావొద్దంటూ భీష్మించాడు. హైదరాబాద్ నుంచి అంబులెన్స్‌లోనే పట్టణంలోని శ్మశాన వాటికను తీసుకువెళ్లగా ఎనిమిది గంటల అనంతరం అక్కడే కన్నుమూయడంతో కుటుంబసభ్యులు అంత్యక్రియలు జరిపి అవమానం భరించలేక మరుసటి రోజే అద్దె ఇంటిని ఖాళీ చేసి ఊరు విడిచి వెళ్లిపోయారు.

● స్థానిక ఆజాద్ రోడ్డులో కూడా అద్దె ఇంట్లో ఉంటూ మృతి చెందిన ఓ మహిళా మృతదేహాన్ని ఇంటిలో ఉంచడానికి యజమాని అంగీకరించకపోవడంతో జోరుగా కురుస్తున్న వర్షంలో బస్తీ రహదారిలోనే చివరి తంతు జరిపి శ్మశానవాటికకు తీసుకువెళ్లి అంత్యక్రియలు పూర్తి చేశారు. అలాగే పోచమ్మవాడ, బ్రాహ్మణ వాడలో కూడా ఏడాది క్రితం ఇలాంటి ఘటనలే నెలకొనడంతో బస్తీలోని కమ్యూనిటీహాల్‌లో సంబంధిత కుటుంబాలు 15 రోజుల పాటు ఉండి అంత్యక్రియల తంతు నిర్వహించారు. అదే బస్తీలో నెల రోజుల వ్యవధిలో ఇద్దరు అద్దె ఇంట్లో మృతి చెందగా యజమానుల వైఖరితో ఖాళీ ప్లాట్లలో మృతదేహాలను ఉంచి శ్మశానవాటికకు తీసుకువెళ్లారు.

రంగులు వేయాలన్న సెంటిమెంటుతో

సాధారణంగా ఇంట్లో ఎవరైనా మృతి చెందితే దశదిన కర్మకు ముందు ఆ ఇంటికి గతంలో అయితే సున్నం వేసేవారు. ఇప్పుడు రంగులు వేస్తున్నారు. అలా ఆ ఇంటిని శుద్ధి చేస్తారు. హిందూ సంప్రదాయంలో ఇదో సెంటిమెంటు. ఇంటికి రంగులు వేయడానికి చాలా ఖర్చవుతుంది. ఇంటి అద్దె ఇవ్వడానికే అష్టకష్టాలు పడుతున్న కుటుంబం తమ ఇంటికి రంగులు వేయించలేదన్న భావనతో ఇంటి యజమానులు అద్దెకు ఉంటున్నవారిలో ఎవరైనా మృతి చెందితే ఆ మృతదేహాన్ని ఇంట్లో ఉంచడానికి, అక్కడి నుంచే అంత్యక్రియలు, కర్మకాండ నిర్వహణకు ఇంటి యజమానులు అంగీకరించడం లేదని చెబుతున్నారు.

కార్యాచరణ లేని తీర్మానం

అద్దె ఇంటి వాసుల 'చావు' ఇక్కట్లపై నార్కట్‌పల్లి మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో స్థానిక ప్రజాప్రతినిధులు చర్చించారు. సమస్య పరిష్కారానికి అన్ని వసతులతో కూడిన నాలుగు తాత్కాలిక గదులు దాతలను సంప్రదించి లేదా ప్రభుత్వ స్థలంలో ప్రభుత్వ నిధులతోనైనా నిర్మించాలని తీర్మానించారు. కానీ ఆచరణలోకి రాలేదు.

గౌరవం కాపాడుతాం

అద్దెకు ఉంటూ మృతి చెందిన వారి పట్ల యజమానులు సానుభూతిచూపాలి. వారి పేదరికాన్ని ఎగతాళి చేసేలా అంత్యక్రియలకు ఆటంకం కల్పించొద్దు. ఈ తరహా ఘటనలు భువనగిరిలో పునరావృతం కాకుండా బాధిత కుటుంబాలకు తాత్కాలిక వసతి, మృతుల చివరిమజిలి గౌరవప్రదంగా సాగేందుకు ఇళ్లను నిర్మిస్తాం. ఆయా ఇళ్ల నిర్వాహణ బాధ్యత మునిసిపాలిటీదే. అధికారులతో కలిసి త్వరలోనే స్థలాన్ని ఎంపిక చేసి పనులను ప్రారంభిస్తాం.



పోతంశెట్టి వెంకటేశ్వర్లు, మునిసిపల్ చైర్మన్, భువనగిరి.



సూర్యాపేట నిరాశ్రయుల భవనంలో ఏర్పాటు చేసిన వంటగది

ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు...

యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు మునిసిపాలిటీ కేంద్రంలో కుర్రె సత్తయ్య, రాధమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. వారిది చేనేత కార్మిక కుటుంబం. సొంత ఇల్లులేదు. వారు కష్టపడి కుమార్తె, కుమారుడి వివాహం చేశారు. పెద్ద కుమారుడి వివాహం జరుగలేదు. ఆ దంపతులు పెద్ద కుమారుడితో అద్దె ఇంట్లో ఉండేవారు. మూడేళ్ల క్రితం కుటుంబ సత్తయ్య మృతి చెందగా వారు అద్దెకు ఉంటున్న ఇంటి యజమాని మృతదేహాన్ని ఇంట్లో ఉంచి, కర్మకాండ జరిపించడానికి అంగీకరించలేదు. దాంతో పద్మశాలి కులపెద్దలు అద్దె ఇంటికి సమీపంలో ఉన్న ఖాళీ స్థలంలో టెంటు వేసి అక్కడ శవాన్ని ఉంచి అంత్యక్రియలు నిర్వహించారు. టెంట్ సైడ్ వాల్స్‌కట్టి ఆ 10రోజులు ఆ కుటుంబ సభ్యులను అక్కడే ఉంచి కర్మకాండ పూర్తిచేశారు. అంత్యక్రియలు, కర్మకాండ చేయడానికి కూడా ఆ కుటుంబం వద్ద డబ్బులు లేకపోవడంతో పద్మశాలి కుటుంబాలే తలా కొంత పోగేసి కార్యక్రమాలకు సహకరించాయి. ఆ తర్వాత కుటుంబం మరో అద్దె ఇంట్లోకి వెళ్లింది. సుమారు ఏడాది క్రితం రాధమ్మ మృతి చెందింది. అప్పుడు కూడా ఆమె శవాన్ని కూడా ఇంటిలో ఉంచడానికి ఇంటి యజమాని అంగీకరించకపోవడంతో ఆమె శవాన్ని పశువుల సంతలో ఉంచారు. అప్పుడూ పద్మశాలి కులపెద్దలు, దాతలు తలా కొంత జమ చేసి ఆమె అంత్యక్రియలు, కర్మకాండ నిర్వహించారు. ఆ 10 రోజులు పశువుల సంతలో మునిసిపాలిటీ ఆధీనంలో ఉన్న గదిని ఇప్పించగా మృతురాలి కుమారుడు, బంధువులు అక్కడే ఉన్నారు. సుమారు మూడు మాసాల కిందట అద్దె ఇంట్లో ఉంటున్న బండారు జంగయ్య మృతి చెందారు. అప్పుడూ అదే పరిస్థితి. ఆయన మృతదేహాన్ని చేనేత మగ్గాలు పెట్టిన స్ఫూర్తి భవనం ఎదుట ఉంచి అంత్యక్రియలు నిర్వహించారు. కర్మకాండ ముగిసే వరకు కుటుంబ సభ్యులకు స్ఫూర్తి భవనంలోని ఓ గదిలో ఆశ్రయం కల్పించారు. ఇలా అద్దె భవనాల్లో నివసిస్తున్న కుటుంబాల్లో ఎవరైనా మృతి చెందితే ఆ కుటుంబ సభ్యుల బాధలు వర్ణనాతీతంగా ఉంటున్నాయి.



పేటలో గౌరవప్రదంగా అంతిమ వీడ్కోలు

సూర్యాపేట(కలెక్టరేట్), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరి అంత్యక్రియలు గౌరవప్రదంగా నిర్వహించేందుకు సూర్యాపేట జిల్లా కేంద్రంలో గత ప్రభుత్వం మహాప్రస్థానాన్ని నిర్మించింది. గతంలో గ్రామాల్లో రోడ్ల వెంట, చెరువుల వద్ద దహనసంస్కారాలు చేస్తుండేవారు. అందులో భాగంగా సూర్యాపేట పట్టణంలో సద్దుల చెరువు వద్ద ఉన్న శ్మశానవాటికలో అసౌకర్యాలను గమనించిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీ‌శ్‌రెడ్డి అన్ని సౌకర్యాలతో కూడిన మహాప్రస్థానాన్ని ఏర్పాటు చేయించారు. ప్రస్తుతం మహాప్రస్థానం ప్రాంతం ప్రజలు అబ్బురపరుస్తోంది.

సకల సౌకర్యాలతో...

మినీట్యాంక్‌బండ్ పక్కన గతంలో శ్మశానవాటికలోకి, ఆ ప్రాంతం గుండా వెళ్లాలన్నా ప్రజలకు వణుకు పుట్టేది. అయితే ఆ శ్మశానవాటిక రూపురేఖలను రూ.4కోట్ల వెచ్చించి మహాప్రస్థానాన్ని నిర్మించారు. హన్మకొండ,హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లోని మహాప్రస్థానాలను పరిశీలించి అక్కడిఏర్పాట్లను గమనించి, ఏ విధంగా తీర్చిదిద్దాలో అంచనాకు వచ్చారు.

నిరాశ్రయుల భవనం

సూర్యాపేట మహాప్రస్థానంలో నిరాశ్రయుల భవనాన్ని నిర్మించారు. జిల్లాలో ఎక్కడాలేని విధంగా రూ.80లక్షలతో దీనిని ఏర్పాటుచేశారు. అద్దె ఇళ్ల ఇంటి యజమానులు మృతదేహాన్ని అక్కడ ఉంచేందుకు, కర్మకండలు నిర్వహించేందుకు నిరాకరిస్తున్నారు. ఈ క్రమంలో అలాంటి వారికి ఇబ్బందులు లేకుండా అంత్యక్రియల అనంతరం 11రోజుల పాటు మృతుల కుటుంబ సభ్యులు మహాప్రస్థానంలోనే ఉండి కర్మకాండలు పూర్తి చేసుకొని తిరిగి వెళ్ళే వరకు అన్ని వసతులతో ఈ భవనాన్ని నిర్మించారు. ఈ భవనంలో ఇప్పటివరకు ఏడు కుటుంబాలు వినియోగించుకున్నాయి. కుటుంబసభ్యులు దూర ప్రాంతంలో ఉన్న సమయంలో సంబంధిత మృతదేహాలను మహాప్రస్థానంలో భద్రపరిచి వారు వచ్చాక అంత్యక్రియలు పూర్తి చేశారు. మహాప్రస్థానంలో అంత్యక్రియలు చేసినందుకు బాధిత కుటుంబాల నుంచి రూ.6వేలు మునిసిపాలిటీ ఫీజు వసూలుచేసి అంత్యక్రియలకు అవసరమైన కట్టెలను సమకూర్చుతోంది.

ప్రీ వెడ్డింగ్ షూట్‌లకు వేదికగా

సాధారణంగా ఎవరివైనా అంత్యక్రియలకు, కర్మకాండలు నిర్వహించే రోజుల్లో మాత్రమే శ్మశానవాటికకు వెళ్తుంటారు. కానీ సూర్యాపేట మహాప్రస్థానంలో ఏకంగా కొందరు ప్రీవెడ్డింగ్ షూట్‌లు చేస్తున్నారు. కొంతమంది రీల్స్‌కోసం వీడియోలు, ఫొటోలు తీసుకుంటున్నారు. వారికి మహాప్రస్థానంలో ఏర్పాటుచేసిన గ్రీనరీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

● ప్రభుత్వం, సామాజిక సంస్థలు చొరవ చూపాలి

అద్దె ఇంట్లో ఉంటూ మృతి చెందిన అభాగ్యులకు ఇంటి యజమానుల నుంచి అవమానాలు ఎదురు కాకుండా ప్రభుత్వం, సామాజిక సంస్థలు, సామాజిక స్పృహ చూపాలని పలువురు అంటున్నారు. ఈ తరహా కుటుంబాలకు 15 రోజుల పాటు నీడనిచ్చేలా ప్రత్యేక ఇళ్లను నిర్మించాలని కోరుతున్నారు. ఇప్పటికే పలువురు స్వచ్ఛంద సంస్థలు వైకుంఠ రథాలను ఏర్పాటుచేశారు. అదే తరహాలో 2, 3 గదుల ఇళ్లను నిర్మించి అభాగ్యుల అంతిమయాత్ర సజావుగా సాగేలా, సంబంధిత కుటుంబాలు 15 రోజుల పాటు అవమానాలకు దూరంగా నివసించేలా సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

● మానసిక క్షోభ అనుభవించాం



మాది నార్కట్‌పల్లి సొంత ఊరు కాదు. జీవనోపాధి కోసం ఇక్కడకు వచ్చాం. ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో సొంత ఇల్లు సమకూర్చుకోలేదు. అద్దె ఇంట్లోనే ఉన్నాం. అనారోగ్యంతో నాన్న మృతిచెందినపుడు సెంటిమెంట్‌తో ఇంటి యజమాని మృతదేహాన్ని ఇంట్లో ఉంచేందుకు అంగీకరించలేదు. ఆ సమయంలో నాన్న మృతదేహాన్ని ఎక్కడ ఉంచాలో తెలియని పరిస్థితిలో నేనూ నా కుటుంబ సభ్యులం తీవ్ర మానసిక క్షోభను అనుభవించాం. జెరిపోతుల సత్తయ్య కుటుంబం పెద్ద మనసుతో ముందుకొచ్చి వాళ్ల వ్యవసాయబావి వద్ద నాన్న మృతదేహాన్ని ఉంచడంతో పాటు కర్మ కాండలు పూర్తయ్యే వరకు ఆశ్రయమిచ్చింది. ఈ పరిస్థితి ఎవరికీ రాకూడదు.

నరేష్, స్థానికుడు, నార్కట్‌పల్లి

● చోటు కల్పించడం మానవత్వం అనిపించింది



చనిపోయిన ఇంటి పెద్ద భౌతికదేహాన్ని అద్దె ఇంటి యజమాని నిరాకరించగా ఆ చీకట్లో ఎక్కడ ఉంచాలో తెలియక కుటుంబ సభ్యులు పడిన అవస్థలు మమ్మల్ని కదిలించాయి. మనోవేదన స్వయంగా చూసిన ఆ సమయంలో వారికి చోటు కల్పించడం మానవత్వం అనిపించింది. వారికి సాయం చేయడం పవిత్రకార్యంగా భావించా. నా తల్లి దండ్రులను కూడా సంప్రదించకుండా మా వ్యవసాయబావి వద్ద మృతదేహం ఉంచడంతో పాటు కర్మకాండలు చేసుకోవడానికి ఆశ్రయమిచ్చా. మా బావి దగ్గర మేం నిత్యం కొలిచే(ఎల్లమ్మ) అమ్మవారు ఉన్నా మానవత్వాన్ని మించిన సేవ ఏదీ లేదని అనిపించింది. నా నిర్ణయాన్ని దేవత కూడా మలినంగా భావించదని విశ్వసించా. నా నిర్ణయాన్ని నా తల్లిదండ్రులు కూడా అంగీకరించారు.

జెరిపోతుల భరత్‌గౌడ్, స్థానికుడు నార్కట్‌పల్లి

● సద్వినియోగం చేసుకోవాలి



సూర్యాపేట జిల్లాకేంద్రంలోని మహాప్రస్థానంలో ఏర్పాటు చేసిన నిరాశ్రయుల కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవచ్చు. అద్దె ఇంట్లో ఉండి పార్థివదేహంతో ఇబ్బంది పడేవారు. ఈ నిరాశ్రయుల కేంద్రంలో భద్రపర్చుకోవచ్చు. సుమారు 11 రోజుల పాటు అవకాశం ఉంటుంది.

బి.శ్రీనివాస్, మునిసిపల్ కమిషనర్, సూర్యాపేట

జాతీయస్థాయి పోటీల్లో ప్రథమ బహుమతి

డిండి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో ఆదివారం జరిగిన 20వ జాతీయస్థాయి కరాటే పోటీల్లో డిండి మండలకేంద్రానికి చెందిన విద్యార్థులు ప్రథమ బహుమతి సాధించినట్లు కరాటే మాస్టర్ గోపి తెలిపారు. డిండికి చెందిన 20మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనగా, కటాస్ విభాగంలో అభినయ్, ఇందు, వైశాలి, ఎం.మధు, ఎ.విశాల్, కె.చరణ్ మొదటిస్థానంలో నిలిచినట్లు తెలిపారు. చోటఖాన్ సీనియర్ ఎగ్జామినర్ రవికుమార్, శివకుమార్, లక్‌పతిలు విద్యార్థులను అభినందించారు.



ప్రథమ బహుమతి సాధించిన విద్యార్థులు

జూనియర్స్ ఖోఖో బాలికల జట్టు కెప్టెన్‌గా వైశాలి



దామరచర్ల: తెలంగాణ అసోసియేషన్ జూనియర్స్ ఖోఖో బాలికల జట్టు కెప్టెన్‌గా దామరచర్లమండలకేంద్రంలోని తెలంగాణ గిరిజన గురుకుల కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న నూకల వైశాలి ఎంపికైంది. ఈ నెల 25 నుంచి 28 వరకు ఉత్తర్‌ప్రదేశ్‌లో జరిగే జాతీయస్థాయి టోర్నీకి తెలంగాణ ఖోఖో జట్టుకు ఎంపిక చేసినట్లు తెలంగాణ ఖోఖో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నాతి కృష్ణమూర్తి ఆదివారం తెలిపారు. కాగా మహబూబ్‌నగర్‌లో జరిగిన కోచింగ్ క్యాంప్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచి తెలంగాణ జట్టు కెప్టెన్ అయిన వైశాలిని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, హైదరాబాద్, మహబూబ్‌నగర్ సెక్రటరీ పోచప్ప, ప్రిన్సిపాల్ కవిత, గిరిజన గురుకుల పాఠశాల కోచ్ డి.స్వాతి, నూకల నాగేశ్వర్‌రావు తదితరులు అభినందించారు.

రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపిక



హాలియా: హాలియా మునిసిపాలిటీలోని ఆకాంక్ష హైస్కూల్‌లో చదువుతున్న విద్యార్థి ఆర్.అరవింద్ ఈ నెల 23 నుంచి 25వరకు రాష్ట్రస్థాయి 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అధ్వర్యంలో మహబూబాబాద్ జిల్లాకేంద్రంలో నిర్వహించే నెట్‌బాల్ పోటీల్లో పాల్గొననున్నాడు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ మేడేపల్లి మోహన్‌రావు, ప్రిన్సిపాల్ మోదాల రవీందర్, డైరెక్టర్ ఉన్నం శ్రీనుబాబు, వ్యాయామ ఉపాధ్యాయుడు ఆవుల చంద్రశేఖర్‌యాదవ్‌లు విద్యార్థి అరవింద్‌ను అభినందించారు.

హ్యాండ్ బాల్ జూనియర్స్ బాలబాలికల జిల్లా జట్ల ఎంపిక

కట్టంగూరు: ఈ నెల 26న మండలంలోని చెర్వుఅన్నారం గ్రామంలోని హైస్కూల్ గ్రౌండ్‌లో ఉమ్మడి నల్లగొండ జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హ్యాండ్ బాల్ జూనియర్స్ బాలబాలికల జిల్లా జట్లను ఎంపిక చేస్తామని ఉమ్మడి జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చింతకాయల పుల్లయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపికలో ఉత్తమ ప్రతిభ కనబర్చి జిల్లా జట్లకు ఎంపికైన బాల, బాలికల జట్లు ఈ నెల 29 నుంచి డిసెంబరు 1వ తేదీ వరకు నిజామాబాద్‌లో జరిగే 53వ జూనియర్స్ బాలబాలికల తెలంగాణ రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ చాంపియన్‌షి‌ప్‌లో పాల్గొంటారని తెలిపారు.

కొండచెలిమ బావి నీరు.. అమృతధారలే..!

- ఈ బావి నీరు తాగితే కిడ్నీలో రాళ్లు సైతం మాయమేనట
- ఆర్వో ప్లాంట్లు ఉన్నా ఈ బావి నీళ్లకు పెరుగుతున్న క్రేజ్
- క్యాన్ నీటికి రూ.30 పైమాటే

కొండచెలిమ బావి.. ఈ నీటిని తాగితే కిడ్నీలో ఉండే రాళ్లు సైతం మాయమవుతాయని ఇక్కడి ప్రజల నమ్మకం. అందుకే ఇంటింటికీ ప్యూరీఫైడ్ వాటర్ ఫిల్టర్ ఉన్న అధునాతన కాలంలో కూడా ఈ బావి నీటికి రోజు రోజుకూ క్రేజ్ పెరుగుతుంది. ఈ నీటి విశిష్టత తెలిసిన వారు ఎంత దూరాన ఉన్నా సరే కొనుగోలు చేసి తాగుతారనడంలో అతిశయోక్తి లేదు.

(ఆంధ్రజ్యోతి-రామగిరి)

జిల్లాకేంద్రంలోని పాతబస్తీలోగల మోతికుంట సమీపంలో నవాబుల కాలంలో నిర్మితమైన ఈ బావి నీటికి ఓ ప్రత్యేకత ఉంది. వీధి వీధిన ఆర్వో ప్లాంట్లు, ఇంటింటికీ కృష్ణాజలాలు సరఫరా అవుతున్నా, కొండచెలిమ బావి నీటిని మాత్రమే తాగుతుంటారు ఇక్కడి ప్రజలు. ఈ బావి బ్రహ్మంగారి గుట్ట దిగువ భాగానే ఉంది. గుట్టపైన ఉన్న చెట్ల వేర్ల నడుమ నుంచి ఈ బావిలోకి జలం వస్తుందని ఈప్రాంత ప్రజలు చెప్తున్నారు. కొండలు, చెట్ల వేర్ల మధ్య నుంచి ప్రవహిస్తూ బావిలోకి వస్తున్నందున ఔషధనీటిగా మారుతుందని ఇక్కడ ప్రజల నమ్మకం. అందుకే ఈ నీరు సర్వరోగ నివారిణిగా పని చేస్తుందని చెప్తున్నారు. రూ.10 నుంచి రూ.15లకే మినరల్ వాటర్ 20 లీటర్ల క్యాన్ లభిస్తున్న తరుణంలో ఈ బావి నీళ్లు రెట్టింపు స్థాయిలో అంటే ఒక్క క్యానుకు రూ.30 చొప్పున వెచ్చించి కొనుగోలు చేస్తున్నారన్నారంటే ఈ నీళ్లకు ఎంత ప్రత్యేకత ఉందో అర్థం చేసుకోవచ్చు.

నవాబుల కాలంలో బావి ఏర్పాటు

తెలంగాణలో నవాబుల పరిపాలన కాలంలో నల్లగొండలో ఉన్న నవాబులు ఈ బావిని నాలుగు ఫీట్ల వెడల్పుతో, 25ఫీట్ల లోతులో తొవ్వించి, రాతి కడీలతో నిర్మించారు. కాపురాల గుట్టపై నివాసముండే నవాబులు ఈ బావినీటిని గుర్రాలపై తీసుకెళ్లి తాగేవారని ఇక్కడి పెద్దలు పేర్కొంటున్నారు. ఇదే క్రమంలో అక్కచెలిమ, కొండచెలమ, చెల్లెలు చెలమ అనే ముగ్గురు అక్కచెల్లెలు ఉండేవారట.



ఆధునీకరణ తర్వాత బావి వద్ద నీటిని తీసుకెళ్తున్న ప్రజలు



బావిలో నీరు

వారిపేరిట ఈ బావులను తవ్వించారని మరికొంతమంది చెప్తున్నారు. అయితే అక్కచెలిమ, చెల్లెలు చెలమ బావుల్లో నీరు సాధరణమే కావడంతో ఈనీరు సేవించేందుకు పెద్దగా ఆసక్తి కనబరచలేదని ఈప్రాంత ప్రజలు పేర్కొంటున్నారు. ఇది ఒక భాగమయితే కొండల నడుమ ఉన్నందున ఈ బావికి కొండచెలిమ అనే పేరు వచ్చిందని ఇంకొంతమంది చెప్తున్నారు.

సర్వరోగ నివారణిగా..

చెట్ల వేర్ల నడుమ, గుట్టల రాతి పొదల మధ్య నుంచి ప్రవహిస్తూ బావిలోకి వచ్చి ప్రవహిస్తున్నందున ఈ నీరు ఒక ఔషధంగా తయారయ్యి సర్వరోగ నివారిణిగా, అమృతధారగా పనిచేస్తుందని ఇక్కడ ప్రాంత ప్రజలు నమ్ముతున్నారు. ఈ నీరును సేవిస్తే కిడ్నిలో ఉన్న రాళ్ళను సైతం కరిగించే శక్తి గల మహిమానిత్వంతటి నీరు అని ఇక్కడ ప్రాంత ప్రజలు చెపుతున్నారు.

నీళ్ల విక్రయంతో పలువురికి జీవనాధారం

ఈ నీళ్లే కొంతమందికి జీవనాధారమైంది. ప్రతీ రోజు వాహనాల ద్వారా ఉదయం, సాయంత్రం సమయాల్లో వాహనాల ద్వారా ఈ బావి నీటిని క్యాన్లతో తీసుకెళ్తూ పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఉండేవారికి రూ.30లకు ఒక క్యాన్ చొప్పున విక్రయిస్తూ ఎంతోమంది ఈ నీటిపై ఆధరపడి జీవనం కొనసాగిస్తున్నారు.

బావికి నూతన హంగులు

ఇదిలా ఉంటే గతంలో బావి చుట్టూ చెట్లు ఏపుగా పెరిగి ఉండడంతో పాములు కూడా సంచరించేవి. దీంతో ఆ ప్రాంతం అపరిశుభ్రంగా ఉండేది. అంతేకాకుండా నీటిని చేదుకునేందుకు సౌకర్యవంతంగా గిరకలు ఉండేవి కాదు. ఈ నేపథ్యంలో ఆ వార్డు ప్రజాప్రతినిధి ఎడ్ల శ్రీనివాస్, అప్పటి మునిసిపల్ కమిషనర్ రమణాచారికి పరిస్థితిని లేఖ ద్వారా వివరించారు. కమిషినర్ ఈ ప్రాంతాన్ని పరిశీలించి ఈ బావికి కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాల్సిందేనని సూచించారు. సుమారు రూ.13లక్షలతో బావికి వచ్చే దారిలో సీసీరోడ్డు, సీసీ కెమెరాలు, బావి చుట్టూ ప్లాట్‌ఫాం, బావికి పైన గిరకలు, ఇంకుడు గుంతలు సైతంఏర్పాటు చేయించారు. దీంతో ఆ బావి ప్రస్తుతం కొత్త ఒరవడితో సౌకర్యాలతో కనిపిస్తుంది.


నా భార్యకు కిడ్నిలో రాయి కరిగింది



నెల పదిహేను రోజుల క్రితం నా భార్యకు 14 ఎమ్ఎమ్ సైజుగల రాయి కిడ్నీలో వచ్చింది. డాక్టర్లు చూసి ఆపరేషన్ చేయాల్సిన అవసరం వస్తదని చెప్పారు. ఈక్రమంలో ఒక వ్యక్తి తారసపడి కొండచెలిమ బావి నీరు తాగించి చూడమని సలహా ఇచ్చారు. దీంతో నేను నెల రోజులపాటు బీటీఎస్ నుంచి వచ్చి ఈ నీటిని తీసుకెళ్లి నా భార్యకు తాపించే వాడిని. దీంతో నా భార్య కిడ్నీలో రాయి పూర్తిగా కరిగింది.

ఎండీ జియావుద్దీన్, రెహ్మత్‌నగర్, బీటీఎస్, నల్లగొండ

కుటుంబ పోషణకు ఆసరా



పట్టణంలో వివిధ కాలనీల్లో ఉండే వారికి ప్రతీ రోజు ఈ బావి నీటిని విక్రయిస్తుంటాను. ఈ నీళ్లకు అలవాటైన వారు మినరల్ వాటర్ కూడా తాగలేరు. ఈతాగునీటి విక్రయం ద్వారా వచ్చే ఆదాయం కుటుంబ పోషణకు కొంత ఆసరా అవుతుంది. నాతోపాటు మరికొంతమంది కూడా నీటిని విక్రయిస్తూ నెలకు రూ.12వేల నుంచి రూ.15వేల వరకు సంపాదిస్తుంటారు. మరికొంతమందికి ఈ నీటి విక్రయమే జీవనాధారమైంది.

పెరికె చరణ్, స్థానికుడు, నల్లగొండ

భక్తులతో పోటెత్తిన యాద'గిరి'

● కిక్కిరిసిన ఉభయ క్యూలైన్లు ● శాస్త్రోక్తంగా నిత్య పూజలు ● నిత్యాదాయం రూ.79.70లక్షలు



హోమం నిర్వహిస్తున్న అర్చకులు



క్యూలైన్లలో భక్తుల రద్దీ

భువనగిరి అర్బన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామివారి భక్తులతో పోటెత్తింది. కార్తీక మాసం, వారాంతపు సెలవు రోజు ఆదివారం కావడంతో ఇష్టదైవాలను దర్శించుకునేందుకు భక్తులు రాష్ట్ర నలుమూలల నుంచి అధిక సంఖ్యలో వాహనాలపై తరలివచ్చారు. కొండ కింద పార్కింగ్ ప్రదేశంతోపాటు వాహన పూజల వద్ద మైదానంలో వాహనాలతో నిండిపోగా పార్కింగ్ స్థలం సరిపడక వైకుంఠద్వారం ఇరువైపుల వాహనాలు పెద్ద ఎత్తున నిలిపారు. సుమారు 66వేల మంది భక్తులు క్షేత్ర దర్శనానికి వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. కాగా, ఉభయ (రూ.150ల ప్రత్యేక, ధర్మదర్శన) క్యూలైన్లు భక్తులతో ఉదయం నుంచి రాత్రి వరకు నిండిపోయాయి. ప్రత్యేక దర్శనాలకు గంటన్నర ఉచిత దర్శనాలకు మూడు గంటల సమయం పట్టినట్లు భక్తులు తెలిపారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.79,70,843 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవోపే. భాస్కర్‌రావు తెలిపారు. కాగా, కొండకింద వ్రత మండపాల్లో 1,547 జంటలు సత్యదేవుని వ్రతాలు ఆచరించగా కార్తీక మాసం సందర్భంగా మహిళ భక్తులు కొండపైన, కింద కార్తీక దీపారాధన చేసి మొక్కులు తీర్చుకున్నారు.

శాస్త్రోక్తంగా నిత్య పూజలు

సుప్రభాత సేవతో స్వయంభువులను మేల్కొలిపిన అర్చకులు గర్భగుడిలో కొలువుదీరిన స్వయంభువులను, సువర్ణ ప్రతిష్ఠా మూర్తులను వేదమంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల నడుమ పంచామృతాలతో అభిషేకించి తులసీ దళాలతో అర్చించారు. ప్రాకార మండపంలో సుదర్శన హోమం, నిత్య కల్యాణోత్సవం ఆగమశాస్త్రరీతిలో వైభవంగా చేపట్టారు. అనంతరం గజవాహన సేవలో ఊరేగించి విశ్వక్సేనుడి తొలిపూజలతో నిత్య తిరుకల్యాణోత్సవం ఆగమశాస్త్రరీతిలో చేపట్టారు. సాయంత్రం ప్రధానాలయ ముఖమండపంలో దర్బారు సేవోత్సవం చేపట్టిన ఆచార్యులు సాయంత్రం అలంకార వెండీ జోడు సేవలు, సహస్రనామార్చనలు జరిపారు. పాతగుట్ట ఆలయంలో నిత్య కైంకర్యాలు వేదమంత్రాలు మంగళవాయిద్యాల నడుమ వైభవంగా నిర్వహించిన అర్చకులు సాయంత్రం వెండీ జోడు సేవలు, సహస్రనామార్చనలు జరిపారు.

ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డిని కలవనున్న నిర్వాసితులు

మర్రిగూడ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): నర్సిరెడ్డిగూడెం భూ నిర్వాసితులు నల్లగొండ జిల్లా మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిని సోమవారం హైదరాబాద్‌లో కలవనున్నారు. డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా చర్లగూడ రిజర్వాయర్లలో నర్సిరెడ్డిగూడెం పూర్తిగా ముంపునకు గురైంది. నర్సిరెడ్డిగూడెం 255 కుటుంబాలు ఉండగా అందులో భూ పరిహారం అందరికీ వచ్చినప్పటికి పునరావాసం కల్పించకుండా గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని, పునరావాసం కల్పించాలని నాలుగు నెలల క్రితం చర్లగూడ రిజర్వాయర్‌పై కట్టపై నిరసన తెలిపారు. స్పందించిన ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి భూ నిర్వాసితులతో మాట్లాడి పునరావాసంతో పాటు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ రాని వారికి ప్యాకేజీ అందేవిధంగా ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో సోమవారం హైదరాబాద్‌కు వెళ్లనున్నట్లు నర్సిరెడ్డిగూడెం బాధిత భూనిర్వాసితులు తెలిపారు.

విజయ్‌కుమార్ నియామకం పట్ల హర్షం

హాలియా, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్‌గా నాగార్జునసాగర్‌కు చెందిన చొక్కారపు విజయ్‌కుమార్‌ను నియమించడం పట్ల నల్లగొండ జిల్లా అనుముల మండలం పీఆర్‌టీయూ టీఎస్ నాయకులు సోమవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. విజయ్‌కుమార్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుండా కృష్ణమూర్తి, మంచికంటి మధు, చెన్ను వెంకట్‌రెడ్డి, కొల్లి శ్రీనివాస్‌రెడ్డి, ముడుసు ప్రకాష్ ఉన్నారు.

కనగల్ కత్వాకు 120 ఏళ్లు

- మరమ్మతులకు నోచుకోని కత్వా
- కత్వా కల్లెడ కాల్వల నుంచి చెరువు కుంటలకు వరదనీరు



కనగల్ వాగులో రాతి ఆనకట్ట, శిథిలావస్థకు చేరిన గోల్‌బంగ్లా



కనగల్, నవంబరు 24: (ఆంధ్రజ్యోతి): దిగువకు వృథాగా ప్రవహిస్తున్న వర్షపు నీటిని అడ్డుకుని బీడు భూములకు సాగునీటిని అందిస్తున్న కనగల్ వాగులోని రాతి ఆనకట్టకు(కత్వా) 120 సంవత్సరాల చరిత్ర ఉంది. నాటి నిజాం పాలకులు నిర్మించిన ఈ కట్టడం ఓ అద్భుతమనే చెప్పొచ్చు. నల్లగొండ జిల్లా కనగల్ వాగులో గ్రామానికి ఉత్తరం వైపున 1905 సంవత్సరంలో కేవలం ముడున్నర లక్షల రూపాయల వ్యయంతో దీనిని నిర్మించారు. ఎన్నో భారీ వరదలను తట్టుకుని నిలిచిన ఆనకట్ట కొన్నేళ్లుగా జరుగుతున్న ఇసుక తవ్వకాలతో పాక్షికంగా దెబ్బతిన్నది. ఎప్పటికప్పుడు అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేస్తున్నా కత్వాకు ఇసుక తవ్వకాలతో ప్రమాదం పొంచి ఉంది.

190 మీటర్లు ఏర్పాటు..

కనగల్ వాగుకు అడ్డంగా సుమారు 190 మీటర్ల పొడవున గల కత్వాకు ఇరువైపులా కల్లెడ కాల్వలు ఉన్నాయి. ఎడమ కల్లెడ కాల్వ 25 కిలో మీటర్ల పొడువులో ఉంది. దీని ద్వారా నిడమనూరు మండలం ఊట్కూరు, అనుముల మండలం వెంకటాపురం, పులిమామిడి కనగల్ మండలం ఎస్‌లింగోటం చెరువులకు వరద నీరు చేరుతుంది. కుడి కల్లెడ కాల్వ ద్వారా అనుముల మండలం మారేపల్లి కనగల్ మండలం బొమ్మపల్లి గ్రామ చెరువులకు నీరందుతుంది. ఆయా చెరువుల కింద ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది ఎకరాలకు సాగునీరు పారి పంటలు సంవృద్ధిగా పండుతున్నాయి. వాగు కత్వా పరిసర ప్రాంతాల్లో భూగర్భజలాలు పెరిగి బోరుబావులకు నీరందుతుంది. కనగల్ గ్రామానికి చెందిన మత్స్యకారులు కత్వా వద్ద చేపల వేటను సాగిస్తూ జీవనోపాధిని పొందుతున్నారు.

మంత్రి కోమటిరెడ్డి దృష్టికి తీసుకెళ్తాం



నిజాంలు నిర్మించిన ఈ కత్వా మూడు మండలాల పరిధిలోని పలు చెరువులకు వరద నీటిని అందించటంతో పాటు కనగల్ వాగు పరిసరాల్లో భూగర్భజలాల వృద్ధికి దోహదపడుతుంది. రైతులకు కనగల్ వాగు కత్వా ఓ వరం లాంటింది. రాతి కట్ట దెబ్బతిన్న చోట మరమ్మతుల విషయమై మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తాను.

- నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ

పర్యాటక ప్రదేశంగా గుర్తించాలి

నల్లగొండ పట్టణానికి కేవలం 18 కిలోమీటర్ల దూరంలో ఉన్న కనగల్ వాగు కత్వాను పర్యాటక ప్రదేశంగా అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు. కత్వా వరకు మెరుగైన రోడ్డు సౌకర్యం కల్పించాలని, కత్వా వద్ద ఇసుక తవ్వకాలు నిలిపివేయాలని డిమాండ్ చేస్తున్నారు. వానాకాలంలో వాగులో వచ్చే వరదలకు కత్వా వద్ద ఆహ్లాదకరమైన దృశ్యాలు ఆవిష్కృతం అవుతాయి. కత్వా మీదుగా నీరు పొంగి పొర్లుతుంటే చూడటానికి ఎంతో మనోహరంగా ఉంటుంది. దెబ్బతిన్న వాగు కత్వాకు మరమ్మతు పనులు చేపట్టి బలోపేతం చేయాలని రైతులు కోరుతున్నారు.



ఎడమ కల్లెడ కాల్వ ఖానాలు

చికెన్ ధరలు

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.129	208	236
సూర్యాపేట	రూ.130	190	210
నల్లగొండ	రూ.130	190	220

సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.0450
ప్రస్తుత నీటి మట్టం	585.90
టీఎంసీలు	300.0315
ఎడమకాల్వకు నీటి విడుదల	3431
కుడికాల్వకు	10,120
విద్యుత్ కేంద్రం ద్వారా	నిల్
ఎస్‌ఎల్‌బీసీ ద్వారా	18.00 క్యూసెక్కులు
వరద కాల్వ ద్వారా	300 క్యూసెక్కులు
ఇన్‌ఫ్లో	31,315
అవుట్‌ఫ్లో	15,651 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	మూసివేత

పులిచింతల ప్రాజెక్టు

పూర్తిస్థాయి నీటి నిల్వ	45.77 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	43.54 టీఎంసీలు
పులిచింతలకు నీటి రాక	నిల్
అవుట్‌ఫ్లో	330 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	2వేల క్యూసెక్కులు

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.46
ప్రస్తుత నీటి మట్టం	644.58 అడుగులు
టీఎంసీలు	4.35
ఎన్ని గేట్ల ద్వారా	నిల్
ఇన్‌ఫ్లో	315.97 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	68.91 క్యూసెక్కులు

విద్యుత్ స్తంభంపై నుంచి పడి వ్యక్తి మృతి



బిక్షం మృతదేహం

పెన్‌పహాడ్, నవంబరు24(ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్తంభంపై నుంచి కిందపడి వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా పెన్ పహాడ్ మండల కేంద్రంలో ఆదివారం జరిగింది. మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. పెన్‌పహాడ్‌కు చెందిన రైతు కొండ సుధాకర్ తన వ్యవసాయ భూమిలో బోర్ వేసుకున్నాడు. విద్యుత్ కనెక్షన్ ఇవ్వడానికి విద్యుత్ స్తంభాలు పాతడానికి కూలికి ఒగ్గు బిక్షం(45)ను తీసుకెళ్లాడు. స్తంభాలు పాతిన తర్వాత బిక్షం స్తంభం ఎక్కి కాసారాలు బిగిస్తుండగా ప్రమాదవశాత్తు కింద పడిపోవడంతో. 108అంబులెన్స్‌లో సూర్యాపేట జనరల్ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే బిక్షం చనిపోయినట్లు డాక్టర్లు నిర్ధారించారు. బిక్షంకు భార్య శైలజ, ఇద్దరు కుమార్తెలు సుమతి, త్రిష ఉన్నారు.

విద్యుదాఘాతంతో గొర్రెలు మృత్యువాత

మోటకొండూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వైర్ కాసరం విరిగి విద్యుత్ వైర్లు నేలపై పడడంతో రెండు గొర్రెలు, గొర్రె పొట్టేలు మృత్యువాత పడ్డాయి. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా మోటకొండూరు మండలంలోని సికిందర్‌నగర్‌లో శనివారం రాత్రి జరిగింది. బాధితుడు కొల్లూరి కిష్టయ్య తెలిపిన వివరాల ప్రకారం... ఉదయం గొర్రెలను మేపి సాయంత్రం కొట్టానికి తీసుకెళ్లాడు. మందలోని మూడు గొర్రెలు కన్పించకపోవడంతో చుట్టు పక్కల వెతికాడు. పక్కనే ఉన్న స్మశాన వాటికలో విద్యుత్ వైర్లకు తగిలి గొర్రెలు మృత్యువాతపడ్డాయి. వాటి విలువ సుమరు రూ.30వేల వరకు ఉంటుందని బాధితుడు వాపోయాడు.

నల్లబెల్లం, పటిక, సారా పట్టివేత

చివ్వెంల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న నల్లబెల్లం, సారా, పటికను ఎక్సైజ్ అధికారులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. సూర్యాపేట జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆర్. లక్ష్మనాయక్ ఆధ్వర్యంలో పట్టుకున్నారు. ఆదివారం తెల్లవారుజామున మండలంలోని లక్ష్మీనాయక్‌తండా శివారులో వాహనాలు తనిఖీ నిర్వహిస్తుండగా అనుమానంగా ఉన్న డీసీఎంను స్వాధీనం చేసుకున్నారు. వాహనంలో 2,750 కిలోల నల్లబెల్లం, 40 కిలోల పటిక, 10లీటర్ల సారా సీజ్ చేశారు. నాగయ్య, లునావత్ వెంకన్న, ఉపేందర్, వెంకటేశ్వర్లును గుర్తించినట్లు సూర్యాపేట ఎక్సైజ్ సీఐ మల్లయ్య తెలిపారు. దాడిలో ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ రాకేష్, ఎక్సైజ్ ఎస్ఐలు సురేందర్‌బెనర్జీ, గోపాలరావు, శోభారాణి, హెడ్‌కానిస్టేబుల్ అప్సర్, అయూబ్, గఫూర్, కానిస్టేబుల్ క్రాంతి సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక లారీ పట్టివేత

కోదాడ రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమంగా తరలిస్తున్న లారీని సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలోని రామాపురం గ్రామం వద్ద పోలీసులు పట్టుకున్నారు. రూరల్ ఎస్ఐ అనిల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లింగాల వాగు నుంచి కోదాడకు ఆదివారం సాయంత్రం లారీలో ఇసుకను తరలిస్తుండగా, మండల పరిధిలోని రామాపురం క్రాస్ రోడ్డు వద్ద పట్టుకున్నారు. డ్రైవర్ రావెళ్ల శ్రీనివాసరావు, యజమాని వేముల గోపి సాయిలపై కేసు నమోదు చేశారు.

జమిలీ ప్రతిపాదనను వ్యతిరేకించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రమేష్

చిట్యాల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): జమిలీ ఎన్నికల ప్రతిపాదనను ప్రజాస్వామ్య వాదులంతా వ్యతిరేకించాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్ కోరారు. నల్లగొండ జిల్లా చిట్యాలలో ఆదివారం జరిగిన సంఘం జిల్లాస్థాయి రాజకీయ శిక్షణా తరగతుల్లో ఆయన మాట్లాడారు. ఖర్చులు తగ్గించడానికే జమిలీ ఎన్నికలైతే సహజ వనరులను కార్పొరేట్ శక్తులకు అప్పనంగా ఇవ్వకుంటే సరిపోతుందన్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో రాజ్యాంగబద్ధంగా జరుగుతున్న ఎన్నికల విధానంలో మార్పు వద్దన్నారు. బీజేపీ ప్రభుత్వం దేశంలో రాజ్యంగం లేకుండా చేయడానికి ప్రయత్నిస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మల్లం మహేష్, వడ్డగాని మహేష్, మహ్మద్ అక్రం, జిట్ట రమేష్, కట్ట లింగస్వామి పాల్గొన్నారు.

రుణాలు లక్ష్యానికి మించి

(5 పేజీ తరువాయి)

సాగుకానున్నందున రూ.3,301కోట్లు రుణ లక్ష్యంగా నిర్ణయించారు. యాసంగిలో మాత్రం కేవలం వరి పంట సేద్యం అవుతున్నందున లక్ష్యాన్ని తక్కువగా విధించారు. ఈసారి సాగర్ ఆయకట్టుతో పాటు మూసీ, డిండితో పాటు మైనర్ ప్రాజెక్టుల కింద వరిసాగు అధికం కానుంది. కొంత మేరకు భూగర్భ జలాలు కూడా వృద్ధి చెందడంతో యాసంగి సీజన్‌లో బోరుబావుల కింద కూడా వరి సేద్యం కానుంది. వరిసాగు కూడా ఖర్చు అధికం కానుంది. కూలీలు, పొలాల దున్నకం, విత్తనాలు, ఎరువుల వాడకం అధికంగా ఉండనుండంతో ఎకరాకు రూ.50వేల వరకు రుణాన్ని బ్యాంకర్లు మంజూరు చేయనున్నారు.

కొత్త, రెన్యూవల్స్‌తో పెరిగిన రుణాలు

ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యాన్ని మించి జిల్లాలో రుణ పంపిణీ జరిగింది. బ్యాంకర్ల సహకారంతో రుణాలు పెరిగాయి. రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ చేయడంతో కొత్త రుణాలతో పాటు రెన్యూవల్స్‌ను అధికంగా చేయడం వల్ల వానాకాలంలో రూ.7,399కోట్లు రైతులకు మంజూరు చేశాం. ఇదంతా రుణమాఫీ కావడంతోనే జరిగింది. కొత్త రుణాలతో పాటు రుణాల రెన్యూవల్స్ కూడా కావడంతో లక్ష్యానికి మించి రుణపంపిణీ జరిగింది.

● శ్రామిక్, నల్లగొండ జిల్లా ఎల్‌డీఎం.

భవిష్యత్‌లో బీసీలదే రాజ్యాధికారం

● ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

హాలియా, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): భవిష్యత్‌లో బీసీలదే రాజ్యాధికారం కానుందని, వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తే సహించేది లేదని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు. కవయిత్రి మల్లమాంబ విగ్రహ ఏర్పాటును అడ్డుకోవడంతో కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన నిరసన ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ నేతల విగ్రహాలను తొలగిస్తే బీసీలంతా ఐక్యంగా కలిసి రాజకీయ పార్టీల నాయకుల కుర్చీలను కూడా కూల్చివేస్తామని హెచ్చరించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 12 నియోజకవర్గాలుంటే ఒక బీసీ, ఒక ఎస్సీ, ఒక ఎస్టీ ఎమ్మెల్యేలు ఉన్నారని మిగిలిన ఎనిమిది మంది రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారే ఉన్నారన్నారు. ఏఐసీసీ నాయకుడు రాహుల్ గాంధీ ఒక వైపు బీసీ కులాల అభివృద్ధికి 42శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని చెబితే జానారెడ్డి దానిని అడ్డుకున్నారన్నారు. బీసీలను అణగదొక్కేందుకు ఇన్ని రోజులు రాజకీయ నాయకులు చేసిన కుట్రలు ఉన్నాయో రానున్న రోజుల్లో వాళ్ల పాప పరిహారం పోతాయన్నారు. తెలంగాణ రాష్ట్రంలో బీసీ రాజ్యం రాబోతోందన్నారు. భవిష్యత్‌లో మనమంతా ముందుకెళ్లడానికి నాంది పలకాలని పిలుపునిచ్చారు. త్వరలో సాగర్ నియోజకవర్గంతో పాటు నల్లగొండలోని ఎన్జీ కళాశాలలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేస్తామన్నారు. హాలియా మున్సిపల్ చైర్‌పర్సన్ పార్వతమ్మ భర్త ఆరోగ్యం బాగా లేకపోతే ఆమెపై కనీసం జాలి లేకుండా ఆమెను పదవి నుంచి తొలగించారన్నారు. అగ్రవర్ణంలోని ఆర్యవైశ్యులు కూడా మాతో కలిసి రావాలన్నారు. ఓసీల ఓట్లను అడగబోమని, రెడ్లు కూడా బీసీల ఓట్లు అడవద్దని, బీసీ ఉద్యోగులను సైతం ఏసీబీ కేసులతో వేధిస్తున్నారని ఆరోపించారు. ఈడబ్ల్యూఎస్‌తో బీసీలకు తీరని అన్యాయం జరిగిందన్నారు. బీసీలు అధికారంలోకి రాగానే ఉద్యోగాలు పొందిన ఓసీలను రీకాల్ చేస్తామన్నారు. మల్లమాంబ విగ్రహాన్ని అవమానపరిచిన మున్సిపల్ కమిషనర్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. జానారెడ్డి వెంటనే మల్ల విగ్రహాన్ని ఆ స్థానంలోనే ఏర్పాటు చేసి గౌరవించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కుమ్మర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాలకృష్ణ, బీసీ నాయకులు వట్టే జానయ్య, మహేష్, బొడ్డుపల్లి చంద్రశేఖర్, సుదర్శన్, పొదిలి శ్రీనివాస్, నల్లగొండ సుధాకర్, తండు సైదులుగౌడ్, అర్జున్, కోట్ల వాసు తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలి

త్రిపురారం నవంబరు 24,(ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజనంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఎంపీడీవో విజయకుమారి, తహసీల్దార్ ప్రమీల, ఎంఈవో రవినాయక్ అన్నారు. నల్లగొండ జిల్లా త్రిపురారం మండలంలోని కంపాసాగర్ కస్తూర్బా పాఠశాలను ఆదివారం తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని, స్టోర్‌రూంను, తరగతుల వారీగా విద్యార్థుల హాజరును పరిశీలించారు. కస్తూర్బా పాఠశాల ఆవరణ పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. 100మంది విద్యార్థినులకు 68మంది ఉండటంపై ఆరాతీయగా జలుబు, జ్వరంతో ఇంటికి వెళ్లినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. నీటిసంపు పనులు పరిశీలించి నాణ్యత విషయంలో రాజీలేదని పనిపూర్తి చేస్తామన్నారు.

బావిలో ఇరుకున్న మోటార్‌ను తీయబోయి..





సైదులు(ఫైల్), బావి వద్ద గుమిగూడిన గ్రామస్థులు

వేములపల్లి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): బావిలో ఇరుకున్న మోటార్ తీయబోయి బావిలో పడి వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా వేములపల్లి మండలంలోని లక్ష్మీదేవిగూడెం గ్రామ శివారులో ఆదివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆమనగల్లు గ్రామానికి చెందిన బంటు సైదులు(37) ఆదివారం మధ్యాహ్నం లక్ష్మీదేవిగూడెం గ్రామానికి చేరుకున్నాడు. గ్రామ శివారులోని తన పొలం వద్దకు వెళ్తుండగా అదే గ్రామపంచాయతీ పరిధిలోని చలిచీమలపాలెంకు చెందిన చెన్నబోయిన విఠల్ సైతం లక్ష్మీదేవిగూడేనికి వచ్చాడు. అక్కడ ఉన్న బంటు సైదులును తన వ్యవసాయ బావిలో మోటార్ ఇరుక్కుపోయిందని దానిని తీసేందుకు రావాలని విఠల్ వెంట తీసుకెళ్లాడు. విఠల్ ఒడ్డున ఉండగా సైదులు బావిలోకి దిగి మోటార్ తీసేందుకు ప్రయత్నిస్తుండగా నీటిలో మునిగి తిరిగి పైకి రాలేదు. దీంతో గమనించిన విఠల్ స్థానికులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడి వచ్చి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ వెంకటేశ్వర్లు, ఏఎస్ఐ నరసింహారావు తమ సిబ్బందితో అక్కడికి వెళ్లి స్థానిక ఈతగాళ్లతో బావిలో గాలించగా సైదులు మృతదేహం రాత్రి లభ్యమైంది. మృతదేహాన్ని మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. సైదులుకు భార్య సుజాత, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ సంఘటనపై ఇప్పటివరకు ఎవరూ ఫిర్యాదు చేయలేదని పోలీసులు తెలిపారు.

వాగు గుంతలో పడి..

మునుగోడు రూరల్, (ఆంధ్రజ్యోతి): వాగు గుంతలో పడి వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా మండలంలోని చోల్లేడు గ్రామంలో ఆదివారం జరిగింది. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన దోటి సత్తయ్య(31) చిన్నప్పటి నుంచి మతిస్థిమితం లేకుండా తిరుగుతూ ఇంటి నుంచి వెళ్లి రెండు, మూడు రోజుకోసారి వచ్చేవాడు. ఈ నెల 21వ తేదీన ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. ఆదివారం ఉదయం అదే గ్రామానికి చెందిన వంగూరి శంకరయ్య పెద్దమ్మ గుడి దగ్గర వాగు గుంతలో నీటిలో తేలాడుతున్న సత్తయ్య మృతదేహాన్ని చూసి కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని నీటి గుంతలో నుంచి మృతదేహాన్ని తీసి పంచనామా నిర్వహించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సత్తయ్య సోదరుడు నరసింహ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవి తెలిపారు.

దివ్యాంగులకు రూ.6వేల పింఛన్ ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న జంగయ్య

దేవరకొండ, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు, బీడీ కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వం రూ.6వేల పింఛన్ ఇస్తామన్న హామీని వెంటనే అమలు చేయాలని దివ్యాంగుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జంగయ్య కోరారు. నల్లగొండ జిల్లా దేవరకొండలోని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం భవనంలో ఆదివారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, బీడీ కార్మికులు, చేనేత కార్మికులకు నెలకు రూ.4వేలు, దివ్యాంగులకు నెలకు రూ.6వేలు ఇస్తానన్నా హామీని 11 నెలలు గడుస్తున్నా అమలు చేయలేదన్నారు. ఈ నెల 26న నల్లగొండలో జరిగే మహాగర్జనను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జిల్లా కన్వీనర్ కొమ్ము హరికుమార్, రాష్ట్ర కార్యదర్శి పెరిక శ్రీనివాసులు, గుద్దేటి సైదులు, శ్రీరామదాసు వెంకటచారి, చైతన్యరెడ్డి, భాస్కర్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపిక



మణి, పార్థసారథి

ఆలేరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల ఉమ్మడి నల్లగొండ జిల్లాలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో హైస్కూల్ విద్యార్థులు రాజాబోయిన మణి, శనిగారం పార్థసారథి పాల్గొని క్రీడా ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెడ్‌మాస్టర్ దాసరి మంజుల, ఫీజికల్ డైరెక్టర్ పూల నాగయ్య తెలిపారు. ఈ నెల 28న నుంచి కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లో నిర్వహించే రాష్ట్ర క్రీడాపోటీల్లో పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

ఆలయాల్లో కార్తీక సందడి





చెర్వుగట్టులో క్యూలైన్‌లో భక్తులు, నల్లగొండలో సత్యనారాయణస్వామి వ్రతంలో పాల్గొన్న నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

నార్కట్‌పల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని ప్రసిద్ధ శైవ క్షేత్రమైన చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానానికి భక్తులు ఆదివారం పోటెత్తారు. జిల్లా నుంచే కాకుండా హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు చెర్వుగట్టుకు తరలివచ్చారు. గుట్టపై కార్తీక దీపాలను వెలిగించారు. పుష్కరిణిలో కార్తీక పుణ్యస్నానాలు ఆచరించారు. మూలవిరాట్టు జడల రామలింగేశ్వర స్వామిని దర్శించుకునేందుకు క్యూలైన్లలో బారులు తీరారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా దేవస్థానం సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

ఎల్లమ్మ ఆలయానికి కార్తీక రద్దీ

కనగల్, (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కనగల్ మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్ద గల శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయానికి కార్తీక మాసం భక్తుల రద్దీ కొనసాగుతుంది. ఆదివారం. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు ఆలయ ప్రదిక్షణలు చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. ధ్వజస్తంభం వద్ద కొబ్బరికాయాలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయంలో కుంకుమ, అభిషేక పూజలను జరిపించి చీరసారెలను బోనవైవేద్యాలను ఇష్టదైవానికి సమర్పించుకున్నారు. శివుడివిగ్రహం వద్ద ప్రమిదలు వెలిగించి దీపారాధనలు చేసారు. పుట్టలో పాలు పోసి నాగ పడిగలకు మొక్కుకున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయ సిబ్బంది తగు ఏర్పాట్లు చేశారు.

కలెక్టర్ నివాసంలో సత్యనారాయణస్వామి పూజలు

కనగల్, (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం పురస్కరించుకుని నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలాత్రిపాఠి నివాసంలో ఆదివారం సత్యనారాయణస్వామి వ్రతపూజలు జరిగాయి. దర్వేశిపురం ఎల్లమ్మ ఆలయ అర్చకులు శ్రవణ్‌కుమారాచార్యులు, దామోదర్‌రావ్ ఆధ్వర్యంలో జరిగిన పూజా కార్యక్రమాల్లో కలెక్టర్ పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్‌కు అర్చకులు స్వామివారి ఆశీర్వచనాలు అందజేసారు.

సమాచారం

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

భువనగిరి టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): భువనగిరి పట్టణ ప్రధాన రహదారి వెంట 33 కేవీ, 11కేవీ విద్యుత్ తీగల బిగింపు, ఎల్‌టీ స్తంభాల పనులు సాగుతున్నందున సోమవారం పట్టణంలోని హైదరాబాద్ చౌరస్తా నుంచి జగ్జీవన్‌రామ్ చౌరస్తా వరకు ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో టౌన్ ఏఈ సాయి కృష్ణ తెలిపారు. నిర్దేశిత రహదారి వెంట గల మీనా నగర్, తాతానగర్, జిల్లా ఆసుపత్రి, కేకే హాస్పటల్, అజయ్ హాస్పటల్స్, బ్రిలియంట్ స్కూల్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

కాంగ్రెస్ సమావేశం రేపు

చౌటుప్పల్ టౌన్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): చౌటుప్పల్ పట్టణంలోని జయశ్రీ గార్డెన్ లో ఈ నెల 26 న ఉదయం 11 గంటలకు కాంగ్రెస్ మునిసిపల్ విస్తృత సమావేశం నిర్వహించనున్నట్లు పార్టీ పట్టణ అధ్యక్షుడు సుర్వి నర్సింహగౌడ్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నాయకులు దోనకొండ కృష్ణ, ఎ.లింగస్వామి, పాశం శ్రీను, ఎస్.చిన్న వెంకట్‌రెడ్డి ఉన్నారు.

ఫొటో వీడియోగ్రాఫర్స్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా అప్పలరెడ్డి

భువనగిరి టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఫొటో వీడియో గ్రాఫర్స్ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా భువనగిరి పట్టణానికి చెందిన యామల అప్పలరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌కే.హుస్సేన్ ఆదివారం హైదరాబాద్‌లో నియామక పత్రం అందజేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమితుడైన సీనియర్ ఫొటో గ్రాఫర్ అప్పలరెడ్డిని పలువురు అభినందించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లడే రవి, కోశాధికారి మాధవరెడ్డి పాల్గొన్నారు.

సమగ్ర సర్వే రేపటితో ముగింపు

అడ్డగూడూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమాగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ఈ నెల 26న ముగుస్తుందని ఎంపీడీవో శంకరయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే చివరి దశలో ఉన్నందున్న కుల గణన వివరాలు నమోదు చేయించుకుని వారు గ్రామ పంచాయతీ కార్యదర్శిని సంప్రదించాలని సూచించారు. మండల ప్రజల్లో ఎవరైనా ఇతర ప్రాంతాల్లో నివసిస్తుంటే తప్పనిసరిగా సర్వేలో వివరాలు నమోదు చేయించుకోవాలని ఆయన కోరారు. 26తర్వాత ఎటువంటి ఫిర్యాదులూ స్వీకరించబోమని తెలిపారు.

ఆధ్యాత్మికత ఒక రాచబాట

భూదాన్‌పోచంపల్లి, భువనగిరి రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సకల జీవరాసులలో మానవ జన్మ పవిత్రమైనదని, సంస్కారవం తమైన జీవితానికి 'ఆధ్యాత్మికత' అనేది ఒక రాచబాట అని కృష్ణాజిల్లా పెనమలూరులోని జ్ఞాన సరస్వతీ పీఠము నిర్వాహ కులు బాలావధూత ప్రకాశానంద సరస్వతి స్వామి అన్నారు. ఈనెల 22నుంచి 24వరకు మూడు రోజుల పాటు భూదాన్‌పోచంపల్లి మార్కండేశ్వరస్వామి దేవాలయం యతి కుటీరంలో ఆధ్యాత్మిక భక్త సమాజం పంచదశ వార్షికోత్సవాలు పురస్కరించుకుని ఆత్మజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఆదివారం సాయంత్రం ఆయన భగవద్గీత పై భక్తులకు ప్రవచనాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవుడు భక్తి జీవితాన్ని ఆరంభించి ఆధ్యాత్మితతో ముగించాలన్నారు. ప్రతి ఒక్కరూ ఆత్మజ్ఞానం పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆత్మజ్ఞాన సదస్సుకు మార్కండేశ్వరస్వామి దేవాలయం అధ్యక్షుడు డాక్టర్ సీత సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు భారత అంజనేయులు, ప్రధాన కార్యదర్శి అంకం యాదగిరి, కోశాధికారి ఇంజమూరి యాదగిరి, ధర్మకర్తలు వనం కృష్ణ, మెరుగు యతినందం, గుర్రం కృష్ణ, ఆధ్యాత్మిక భక్త సమాజము అధ్యక్షులు భారత పురుషోత్తం, గౌరవాధ్యక్షులు కట్కం తుకారాం, ఉపాధ్యక్షుడు నర్సింహ పాల్గొన్నారు.

● ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని ఆలయ కమిటీ చైర్మన్ డాక్టర్ జడల అమరేందర్ గౌడ్ అన్నారు. భువనగిరి శివారులోని మాసుకుంట అంజనేయ సహిత రాజరాజేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం సామూహికలక్ష బిల్వార్చన నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వహకులు రాజకోటయ్య, గోనే వెంకట శ్రీనివాస్, సిద్దేశ్వర్, రాజేశ్వర్, చింత రాజు, గడ్డం నరేందర్, చంద్రశేఖర్, కృష్ణ పాల్గొన్నారు.



సంస్థాన్‌నారాయణపురంలో శాకాహార ర్యాలీ నిర్వహిస్తున్న పిరమిడ్ సభ్యులు

ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం

సంస్థాన్‌నారాయణపురం: నిత్య ధ్యానంతో శారీరక ఆరోగ్యం, మానసిక ప్రశాంతత, బుద్ధి సూక్ష్మత, ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం పెరుగుతాయని శ్రీమన్నారాయణ పిరమిడ్ ధ్యాన మందిరం వ్యవస్థాపకురాలు దేశిడి ప్రభావతి తెలిపారు. మండల కేంద్రంలో ధ్యానమందిరం వార్షికోత్సవం సందర్భంగా పెద్ద సంఖ్యలో వచ్చిన ధ్యానులు ఆదివారం శాఖాహార ర్యాలీ నిర్వహించారు. ధ్యాన మందిరం వద్ద సామూహికంగా ధ్యానం చేశారు. కార్తీక వనభోజనాలు నిర్వహించారు. ఈసందర్భంగా ప్రభావతి మాట్లాడుతూ ప్రకృతి సహజంగా ఉండే విశ్వమయ ప్రాణశక్తి పిరమిడ్ ఆకారంలో ఎక్కువగా ఉంటుందని తెలిపారు. పిరమిడ్‌లో కూర్చుని ధ్యానం చేస్తే శరీరంలోని రెండు లక్షల 72వేల నాడులు శుద్ధి అవుతాయన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక ప్రకారం మాంసం తినడం వల్ల 159 రోగాలు వస్తాయని గుర్తు చేశారు. జంతు వధ చేయడం మహా పాపమని తెలిపారు. ప్రతి ఒక్కరూ శాఖాహారులుగా మారాలని కోరారు. పిరమిడ్ స్పిరిచువల్ సొసైటీస్ మూమెంట్ ప్రతినిధులు దేశిడి నరేందర్ రెడ్డి, మల్లారెడ్డి, సతీష్, కిరణ్ కుమార్ రెడ్డి, పున్న పాండు, లక్ష్మి, పద్మాచారి, బాలరాజు పాల్గొన్నారు.

రామాయణం పుస్తకాల పంపిణీ

మోత్కూరు : మోత్కూరు మునిసిపాలిటీ కేంద్రంలో శ్రీఅంజనేయ స్వామి ఆలయానికి ప్రతి మంగళ, శనివారాల చొప్పున వరుసగా 11 వారాలు వచ్చిన భక్తులకు పల్లెర్ల వెంకన్న రామాయణం పుస్తకాలను అందజేస్తున్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన కొన్ని రామాయణం పుస్తకాలు ఆలయ పూజారి పారునంది సూరిబాబు శర్మకు అందజేశారు. రామాయణం పుస్తకం వెల రూ.550 అని, ఎందరు భక్తులు వచ్చినా అందజేస్తానన్నారు. ప్రతీ కుటుంబం రామాయణాన్ని చదవాలన్నదే తన సంకల్పమని దాత వెంకన్న తెలిపారు.

శాస్త్రోక్తంగా అధ్యయనోత్సవాలు ఆరంభం

వలిగొండ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుంకిశాల గ్రామంలో ప్రవాస భారతీయులు డాక్టర్ పైళ్ల మల్లారెడ్డి-సాధన దాతృత్వంలో నెలకొల్పిన శ్రీ వేంకటేశ్వరాస్వామి దేవాలయంలో 27వ వార్షిక బ్రహోత్సవాల్లో భాగంగా అధ్యయనోత్సవాలు ఆదివారం శాస్త్రోక్తంగా ఆరంభమయ్యాయి. స్వామి, అమ్మవార్లకు అర్చకులు వేద మంత్రాలతో అభిషేకించి దివ్య మనోహరంగా అలంకరించి ప్రత్యేక వేదికపైన అధిష్టింపజేశారు. ఉత్సవమూర్తుల సేవ అల్వార్లను అదిష్టింపజేసి దివ్య ప్రభంద వేదపఠనం జరిపారు. శ్రీ వైష్ణవ ఆలయాల్లో బ్రహ్మోత్సవాలకు ముందస్తుగా అధ్యయనోత్సవాలు నిర్వహించడం సంప్రదాయం. కార్యక్రమంలో దేవాలయ ప్రధాన అర్చకులు సంతోష్‌కుమార్‌చార్యులు, అర్చకులు పాల్గొన్నారు.



సుంకిశాలలో ప్రబంధ పఠనం చేస్తున్న అర్చకులు

అయ్యప్ప మాలధారులకు అన్నదానం



చౌటుప్పల్: అయ్యప్ప ఆలయంలో అన్నదానం చేస్తున్న రమాదేవి

చౌటుప్పల్ టౌన్ : చౌటుప్పల్ పట్టణంలోని అయ్యప్ప స్వామి దేవాలయంలో ఆదివారం మాలధారులకు పి.రమాదేవి అన్నదానం చేశారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ అధ్యక్షుడు కామిశెట్టి భాస్కర్, తూర్పాటి శంకర్, చింతల సాయిలు, సుక్క సుదర్శన్ పాల్గొన్నారు.

ప్రజా పోరాటాలకు అండగా నిలవాలి

ఆలేరు రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సీపీఎం ఆధ్వర్యంలో నిర్విహించే ప్రజాపోరాటాలకు అన్నివర్గాల ప్రజలు అండగా నిలవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ.జహంగీర్ అన్నారు. ఆదివారం మండలంలోని టంగుటూరులో జూకంటి ఐలుమల్లయ్య స్మారక స్తూపాన్ని ఆయన ఆవిష్కరించారు. ఎందరో పోరాటాల వీరులగన్న టంగుటూరు ఉద్యమాలకు ఆదర్శనీయంగా నిలిచిందన్నారు. సీపీఎం నాయకుడిగా ఐలు మల్లయ్య పేద ప్రజల సంక్షేమం కోసం ఎంతగానో కృషి చేశారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమించాలని పిలుపునిచ్చారన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా, డివిజన్, మండల, నాయకులు మాటూరి బాలరాజుగౌడ్, కూరాకుల మల్లిఖార్జున్, దూపటి వెంకటేష్, ఇక్బాల్, సత్యరాజయ్య, తులసయ్య, రాములు, ఉప్పలయ్య, అశోక్, మల్లేష్, ఉదయ్, సిద్దులు, అంజనేయులు ఉన్నారు.



టంగుటూరులో ఐలుమల్లయ్య స్మారక స్తూపాన్ని ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

ఆలేరు రూరల్: మండలంలోని పటేల్‌గూడెంలో ఇంటింటికీ సీపీఎం కార్యక్రమం నిర్వహించారు. డిసెంబరు 15, 16, 17 తేదీల్లో చౌటుప్పల్‌లో జరిగే జిల్లా 3వ మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి దూపటి వెంకటేష్, నాయకులు తులసయ్య, గణేష్, భాస్కర్ ఉన్నారు.

యాదగిరిగుట్ట రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మంగ నర్సింహులు అన్నారు. ఆదివారం మండలంలోని పెద్దకందుకూర్ గ్రామంలో ఇంటింటికి సీపీఎం కార్యక్రమాన్ని నిర్వహించారు. నాయకులు పోశెట్టి, భీమగాని రాములు పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం): పార్టీ జిల్లా మహాసభల కరపత్రాన్ని ఆదివారం మండల కేంద్రంలో విడుదల చేశారు. సీపీ ఎం మండల కార్యదర్శి వేముల బిక్షం, జిల్లా నాయకుడు రచ్చ గోవర్ధన్, పట్టణ కార్యదర్శి రాచమల్ల సత్తయ్య, టి.సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

నిర్వాసితులకు పరిహారం చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు

భువనగిరి రూరల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ఎత్తిపోతల్లో భాగంగా బస్వాపూర్ రిజర్వాయర్‌లో ముంపునకు గురవుతున్న నిర్వాసితులకు వెంటనే పరిహారం అందజేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం భువనగిరిలోని పార్టీ జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బస్వాపూర్ రిజర్వాయర్‌లో భూములు కోల్పోయిన బాధితులకు 18సంవత్సరాల నుంచి నష్ట పరిహారం చెల్లించడంలో పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. కబ్జాలో ఉండి భూములు సాగు చేసుకుంటున్న ప్రతీ రైతుకు పరిహారం అందించాలన్నారు. రెవెన్యూ అధికారుల అంచనా ప్రకారం సుమారు 100 మంది రైతులు ఉన్నట్లు గుర్తించారన్నారు. హైకోర్టు నుంచి బాధిత రైతుల తరపున న్యాయం ఉన్నప్పటికీ సదరు కాంట్రాక్టర్ దౌర్జన్యం చేసి నిర్మాణ పనులు కొనసాగిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి జోక్యం చేసుకుని బాధిత రైతులందరికీ న్యాయం చేయాలని కోరారు. ముంపునకు గురైన బీయన్‌తిమ్మాపూర్ నిర్వాసితులకు భువనగిరి శివారులోని హుస్నేనబాద రెవెన్యూ పరిధిలో 107 సర్వే నెంబర్‌లో పునరావాసం కింద కేటాయిచిన లే అవుట్‌లో అన్ని వసతులను కల్పించాలన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా, మండల నాయకులు ఏశాల అశోక్, మరిపల్లి రాములు, పుట్ట రమేష్, వస్త్రావుల అభిలాష్, దాసరి లక్ష్మయ్య పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందజేస్తున్న సంజీవరెడ్డి

మోటకొండూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాటేపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గంధమల్ల ఎల్లయ్య మాతృమూర్తి గంధమల్ల ఈరమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. ఆదివారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు యెల్లంల సంజీవరెడ్డి మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. 5వేల ఆర్థిక సహాయం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర నాయకుడు జనగాం ఉపేందర్‌రెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు పడమటి రాంరెడ్డి, పచ్చిమట్ల మధుగౌడ్, గంధమల్ల నరసింహ, పచ్చిమట్ల మహేష్ గౌడ్, గంధమల్ల శ్రీనివాస్, మధు, రాజు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యక్రమాలను అరికట్టేందుకు కృషి

భువనగిరి రూరల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): అసాంఘిక కార్యక్రమాలను అరికట్టేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు భువనగిరి రూరల్ ఎస్‌హెచ్‌వో వారణాసి సంతోష్‌కుమార్ అన్నారు. ఆదివారం భువనగిరి మండలం హన్మాపురం వద్ద రాకపోకలు కొనసాగిస్తున్న వాహనాల తనిఖీ చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారుల వెంట కొంత మంది తమ వాహనాల్లో గంజాయి తదితర మాదక ద్రవ్యాలు తరలించుకుపోవడంతో పాటు అసాంఘిక కార్యక్రమాలు చేపట్టే అవకాశం ఉన్నందున వాహనాల తనిఖీ నిర్వహిస్తున్నామన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే శక్తుల పట్ల కఠినంగా వ్యవహరిస్తామన్నారు.

ఓటరు నమోదును సద్వినియోగం చేసుకోవాలి

భూదాన్‌పోచంపల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా 51 పోలింగ్ కేంద్రాల్లో ఆదివారం నిర్వహించిన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా మండల తహసీల్దారు మహేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని జడ్పీహెచ్‌ఎస్ ఆవరణలో పోలింగ్ స్టేషన్‌ను సందర్శించి ఓటరు నమోదు ప్రక్రియను పరిశీలించారు. ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో 5 ఫామ్-6, 1 ఫామ్ 8 వచ్చాయని తెలిపారు. ఎంఆర్‌ఐ గుత్తా వెంకట్‌రెడ్డి, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

సింహ గర్జనను విజయవంతం చేయాలి

చౌటుప్పల్ రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): డిసెంబర్ 1 న హైదరాబాదు పెరేడ్ గ్రౌండ్‌లో జరిగే మాలల సింహగర్జనను విజయవంతం చేయాలని మాల మహానాడు మునుగోడు నియోజకవర్గ కన్వీనర్ మహేశ్వరం కిష్టయ్య పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని దండు మల్కాపురం, కైతాపురం ధర్మాజీగూడెం గ్రామాల్లో సింహగర్జన సభ విజయవంతం కోసం ప్రచారం నిర్వహించారు. వాల్ పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ మాలల సింహగర్జనకు మాలలు లక్షలాదిగా తరలిరావాలన్నారు. మాలలంతా ఐక్యతగా, సంఘటితమై కలిసికట్టుగా ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని కోరారు. ఎస్సీ జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్ శాతాన్ని పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి ఎడ్ల లింగస్వామి, నాయకులు యనమల నాగరాజు, తగరం వెంకటేశం, మంత్రి యాదయ్య, వల్లబోతు భాస్కర్, బొంతల రవీందర్, సంగం నర్సింగరావు, వల్లబోతు లక్ష్మయ్య, దౌడీ యాదయ్య, బొంతల యువరాజ్, దౌడీ యాదయ్య, వల్లబోతు సురేష్, సంగం చంద్రయ్య పాల్గొన్నారు.

మోత్కూరు, అడ్డగూడూరు: మండలంలోని దాచారంతో పాటు అడ్డగూడూరులో మాల మహానాడు అధికార ప్రతినిధి బోడ బాబూరావు సింహగర్జన వాల్ పోస్టర్లు విడుదల చేసి మాట్లాడారు. మాలలు మంచికి, వీరత్వానికి, మేథో సంపత్తికి మారు పేరన్నారు. ఎస్సీ సామాజిక వర్గానికి అందే ఫలాలు (విద్య, ఉద్యోగ, సంక్షేమ పథకాలు) మాలలకు అందకుండా చేయడానికి కుట్రలు చేస్తున్నారని ఆయన విమర్శించారు. డిసెంబరు 1న హైద్రాబాదులో నిర్వహించే సభకు మాలలు అధిక సంఖ్యలో తరలి వచ్చి మాలల ఐక్యతను చాటాలని, మన వాణి వినిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బుంగ లక్ష్మయ్య, గోలి బిక్షం, కామిండ్ల నర్సయ్య, మల్లయ్య, నరేందర్, యేసయ్య, లింగయ్య, రవి, బిక్షమయ్య, సత్తయ్య జక్కుల యాదగిరి, పట్టేటి యాదగిరి, బోడ ముత్తయ్య, జక్కుల భాగ్యరావు ఉన్నారు.



చౌటుప్పల్: పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఉపాధి హామీ పథకాన్ని అమలు చేయాలి

భువనగిరి టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకాన్ని పట్టణ ప్రాంతాల్లో కూడా అమలు చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రాములు అన్నారు. ఆదివారం భువనగిరిలో జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో మాదిరిగానే పట్టణాల్లోనూ పేదలు, పని లభించని పరిస్థితులు ఉన్నాయన్నారు. పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు చేస్తున్న ప్రయత్నాలను కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలన్నారు. సంక్షేమ పథకాలకు ఆధార్ కార్డును మాత్రమే ప్రామాణికంగా తీసుకోవద్దని, రేషన్ కార్డు అర్హతగా పథకాలను వర్తింపచేయాలన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కొండమడుగు నర్సింహ, రాచకొండ రాములమ్మ, జెల్లెల పెంటయ్య, గంగాదేవి సైదులు, సిరిపంగి స్వామి, శ్రీనివాసచారి పాల్గొన్నారు.

రామన్నపేట : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు కూలీ విధానాలను నిరసిస్తూ ఈ నెల 26న కలెక్టరేట్ ముందు జరిగే ధర్నాను జయప్రదం చేయాలని రైతు జిల్లా అధ్యక్షుడు మేక అశోక్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ వ్యాప్తంగా మోదీ ప్రభుత్వం అవలంభించే కార్మిక, రైతు కూలీ వ్యతిరేక విధానాలపై నిరసన కార్యక్రమాలు జయప్రదం చేయాలని కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జెల్లెల పెంటయ్య, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గొరిగె సోములు పాల్గొన్నారు.



భువనగిరి: సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్రాములు

టీడీపీని బలోపేతం చేయాలి



పార్టీ సభ్యత్వ కార్యక్రమంలో కుందారపు కృష్ణాచారి తదితరులు

భువనగిరి రూరల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి కార్యకర్తలు సైనికుల వలే పని చేసి పార్టీకి పూర్వ వైభవం తీసుకురావాలని తెలుగుదేశం పార్టీ భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ కుందారపు కృష్ణాచారి అన్నారు. ఆదివారం భువనగిరి మండలం హన్మాపురం గ్రామంలో పార్టీ సభ్యత్వ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి అధికారుల దృష్టికి తీసుకువచ్చి ప్రజల పక్షాన పోరాడాలన్నారు. ఈ టీడీపీ మండల అధ్యక్షుడు ఎర్రబోయిన రమేశ్ యాదవ్, నాయకులు కల్లూరి నవీన్, రేగు బీరప్ప, ఎ.కనకరాజు, ఉడుత నర్సింహులు పాల్గొన్నారు.

కష్టపడిన వారికి గుర్తింపు తథ్యం



జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అవేజ్ చిస్తీని సన్మానిస్తున్న నాయకులు

భువనగిరి టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం కష్టపడిన వారందరికీ ప్రభుత్వంలో గుర్తింపు లభించడం తథ్యమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండీ.అవేజ్ చిస్తీ అన్నారు. ఆదివారం భువనగిరిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలతో నిమిత్తం లేకుండా కార్యకర్తలందరూ పార్టీ పట్ల చిత్తశుద్ధిగా ఉండాలన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా అవకాశం కల్పించిన ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా ముస్లీం మైనార్టీ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో నాయకులు భట్టు రాంచంద్రయ్య, ఎండి షరీఫ్, మజార్ అలీ, ముతాన్‌షా, సల్లా ఉద్దీన్, ఎండి అథహర్, ఎండి లయక్ అహ్మద్, ఎండి ఇంతియాజ్, సల్మాన్, యూసుఫ్ జబ్బార్, అనీఫ్ పాల్గొన్నారు.

త్రిలింగేశ్వర ఆలయ కమిటీ చైర్మన్‌గా శ్రీనివాస్

భువనగిరి రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): భువనగిరి మండలం తాజ్‌పూర్ శివారులోని త్రిలింగేశ్వర స్వామి ఆలయ కమిటీ చైర్మన్‌గా డాక్టర్ ర్యాకల శ్రీనివాస్‌ను గ్రామ మాజీ సర్పంచ్‌లు ఓరుగంటి నాగయ్య గౌడ్, బొమ్మారపు సురేశ్‌లు ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం గ్రామస్తులు సమావేశమై అధ్యక్షుడిగా డాక్టర్ ర్యాకల శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా ఓరుగంటి వేణు, పి.కిరణ్, పి.బాలరాజు, వి.అఖిల్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా ఓరుగంటి రమేష్‌గౌడ్, కోశాధికారిగా అరుణ్, గంజి సందీప్, సహాయ కార్యదర్శులుగా సుధీర్‌గౌడ్, ఆర్.అనిల్, సలహాదారులుగా కృష్ణ, అజయ్, పాండు, నాగరాజు, రామకృష్ణ, భరత్, సాయి, ప్రసాద్‌ను ఎన్నుకున్నారు.

పీఆర్‌టీయూ రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్‌గా విజయ్‌కుమార్

రామన్నపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రోగ్రెసీవ్ రికగ్నిస్ట్ టీచర్స్ యూనియన్ (పీఆర్‌టీయూ) రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్‌గా చొక్కారపు విజయ్‌కుమార్‌ను నియమిస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పింగిలి శ్రీపాల్‌రెడ్డి ప్రధాన కార్యదర్శి పుల్గం దామోదర్‌రెడ్డి ఆదివారం తెలిపారు. రాబోయే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పింగలి శ్రీపాల్‌రెడ్డి, వంగా మహేందర్‌రెడ్డి గెలుపునకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆయన నియామకం పట్ల పీఆర్‌టీయూ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

గుట్టలో దివ్య జీవన సంఘం మండల కమిటీ ఎన్నిక

యాదగిరిగుట్ట రూరల్, నవంబరు 24, అనంతపురం శివానంద అనుబంధ సంఘం దివ్య జీవన మండల నూతన కమిటీ ఎన్నిక ఆదివారం పట్టణంలో జరిగింది. అధ్యక్షుడిగా బత్తిని కృష్ణగౌడ్, ప్రధాన కార్యదర్శిగా తోట సత్యనారాయణ, కోశాధికారిగా చెడుదూపు సత్యనారాణ, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమానికి విశాఖపట్నం శ్రీవిష్ణుదేవానంద సరస్వతి హాజరయ్యారు.

బస్సుల కోసం నిరీక్షణ

యాదగిరిగుట్ట రూరల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీ బస్టాండ్‌లో ప్రయాణికులు బస్సుల కోసం గంటల తరబడి ఎదురు చూస్తున్నారు. ఆదివారం, కార్తీక మాసం కావడంతో యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో రావడంతో రోజువారీ బస్సులు సరిపోక ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. డిలో ఉన్న బస్సులతో సేవలు అందిస్తున్నప్పటికీ ప్రయాణికులకు సరిపోను లేకపోవడంతో గంటల తరబడి ఎదురుచూస్తూ నిరీక్షించారు. మారుమూల గ్రామాలకు కొన్ని సర్వీసులను రద్దుచేసినప్పటికీ వేల సంఖ్యలో ప్రయాణికుల తాకిడి తట్టుకోలేని అధికారులు, ఇటు ప్రయాణికుల తిప్పలు తప్పలేదు. బస్టాండ్‌కు బస్సులు రాగానే సీట్లకు మించి సైతం ప్రయాణికులు వెళ్లడానికి సిద్ధమవుతున్నారు. అవసరమైతే నిలు చునే ప్రయాణం చేసి గమ్యం స్థానాలకు చేరుకోవాల్సిన పరిస్థితి. ఇదిలా ఉండగా రాత్రి 10గంటల వరకైనా సరే ప్రయాణికులకు ఇబ్బందులు కలుగకుండా వారి గమ్యాలను చేర్చుతామని ఆర్టీసీ అధికారులు తెలిపారు.



యాదగిరిగుట్ట బస్టాండ్‌లో బస్సులకోసం వేచి చూస్తున్న ప్రయాణికులు

గంటల తరబడి ఎదురు చూస్తున్నాం



బస్టాండ్‌లో బస్సుల రాకకోసం గంటల తరబడి ఎదురు చూస్తున్నాం. వచ్చిన ఒకటిరెండు బస్సుల్లో వెళ్లడానికి సీట్లు దొరకక.. ఊపిరి ఆడకుండా అధిక సంఖ్యలో ప్రయాణికులు ఎక్కడంతో ఇబ్బందులకు గురవుతున్నాం. ఆర్టీసి యాజమాన్యం కార్తీక మాసం, శని, ఆదివారంలో అదనపు బస్సులను నడపాలి.

-ముత్యాలు, హైదరాబాద్, ప్రయాణికుడు

ప్రయాణికులకు ఇబ్బందులు కలుగనీయం



యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దర్శినార్థం వచ్చే ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలుగనీయం. వారందరినీ సురక్షితంగా గమ్యాలకు చేర్చుతాం. కార్తీకమాసం ఆదివారం కావడంతో ప్రజల రద్దీ ఎక్కువగా ఉండడంతో బస్సుల రాకపోకలకు కొంతవరకు ఆలస్యం అయింది. అయినప్పటికీ ప్రయాణికులందరికీ మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తున్నాం.

-బందారపు శ్రీనివాస్‌గౌడ్, డిపో మేనేజర్, యాదగిరిగుట్ట